Follow: @ANNTELUGU

04-04-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 123 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రివేంజ్ రాజా.. ట్రంప్

### 60 దేశాలపై దబిడిదిబిడి

**చైనా పై 34 శాతం.. భారత్ పై 26 శాతం..**

**ప్రతీకార సుంకాలు**

**భారత్ పై స్నేహ ధర్మాన్ని పాటించని ట్రంప్**

**మహా:** రివేంజ్ రాజా ట్రంప్ దూకుడుమీదున్నాడు. అమెరికా మీదే ఈ దేశాలన్నీ బతుకుతున్నాయంటూ.. దబిడిదిబిడి టాక్స్ లు ప్రకటించిపారేశాడు. దీంతో ప్రపంచ మార్కెట్ పై ఈ ఎఫెక్ట్ రానున్నరోజుల్లో దారుణంగా ఉండనుంది. ట్రంప్ గందరగోళ అత్యాశతో ఆర్థికరంగం షేక్ కానుంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### నటిగా రీఎంట్రీ ఇవ్వనున్న కేంద్ర మాజీ మంత్రి..?



- రాజకీయల్లోకి రాకముందు సినీ, సీరియల్ నటిగా వినోదాన్ని పంచిన స్మృతి ఇరానీ
- త్వరలోనే ఒక వెబ్ సిరీస్ కోసం పనిచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు

02

### హైదరాబాద్‌లో కుండపోత



- అధికారులను అలర్ట్ చేసిన సీఎం రేవంత్
- ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశం

02

### మోదీ జీ.. ఇది మీ కారణంగానే సాధ్యమైంది



- టారిఫ్ మినహాయింపుల వల్ల ఫార్మా ఎగుమతులు పెరుగుతాయి
- బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథిరెడ్డి


02



### హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

మరోసారి పార్లమెంటులో గలమెత్తిన :ఎంపీ రవిచంద్ర

వివరాలు 2లో




### స్కాన్ చేస్తే... చేతిలో సమాచారం

భక్తులకోసం ఏర్పాటు చేసిన వసతులు ఆ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుస్తాయి

వివరాలు 2లో



### మళ్ళీ మనదే అధికారం

- అందరం బ్రహ్మాండంగా గెలుస్తాం.. వార్ వన్ సైడే
- కరీంనగర్, ఆదిలాబాద్ నేతలతో కేసీఆర్

వివరాలు 3లో

# తెలంగాణ ప్రజలు చేసిన మేలు మరువరు

## ప్రజలు ఎపుడూ కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారు



**నేతలు మరింత కష్టపడాలి.. అందరికీ సంక్షేమ పథకాలు అందించాలి**

**తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సోనియాగాంధీ దిశానిర్దేశం**

**రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చర్చలు**

**బీసీ రిజర్వేషన్లపై మోదీ ప్రభుత్వంతో కొట్లాడుతామని రాహుల్ హామీ**

**ఢిల్లీ, మహా:** తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నంటే ఉన్నారని, వారికి చేసే మేలు ప్రజలు మరవరని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అన్నారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు సోనియాగాంధీని కలిశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ఈ సందర్భంగా నేతలకు సోనియా గాంధీ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నంటే ఉన్నారని వారికి చేసే మేలు ప్రజలు మరవరని అన్నారు. బీసీ రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పులు తెస్తాయని ఉద్ఘాటించారు. నేతలు మరింత కష్టపడాలని.. అందరికి సంక్షేమ పథకాలు అందించాలని సోనియా గాంధీ సూచించారు. 2008లో సోనియా గాంధీని కలిశానని పాత జ్ఞాపకాలను ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు.

మిగతా 2లో



## కేసీఆర్‌వి పగటికలలు

### రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీనే ఉండదు

**ఢిల్లీలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**ఢిల్లీ:** తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగలు కంటున్నారని కామెంట్స్ చేశారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. రాష్ట్రంలో రాబోయే రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ ఉండదు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బంగారం లాంటి భూములను దోచుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అంటూ విమర్శలు చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో కలిసి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు ఐఎంజీ భారత్‌కు భూములను అప్పనంగా కట్టబెట్టారు. అప్పుడే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆ భూమి కేటాయింపులను రద్దుచేసి ప్రభుత్వ భూములను కాపాడారు. రాష్ట్రంలో బంగారం లాంటి భూములను దోచుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపైన విచారణ జరగాలి.

మిగతా 2లో

### చార్మినార్ నుంచి ఊడిపడిన పెచ్చులు

పరుగులు పెట్టిన పర్యాటకులు



వివరాలు 3లో

## చైనాతో ఆ వేడుకలేంటి!

### లోక్ సభలో ప్రశ్నించిన రాహుల్



**మహా:** మిత్రదేశమైన అమెరికా మనపై 26శాతం సుంకాలు విధిస్తే ఏం చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీశారు. లోక్‌సభలో జీరో అవర్ సందర్భంగా మాట్లాడిన రాహుల్ భారత్, చైనా సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకలపై విమర్శలు గుప్పించారు.

మిగతా 2లో



## పనులు ఆపండి

### కంచ గచ్చిబౌలిలో వ్యవహారంలో సుప్రీం కీలక ఆదేశాలు

- ప్రభుత్వ చర్యలు నిలిపేయాలని సూచన
- ఈనెల 16కు విచారణ వాయిదా
- సుప్రీం ఆదేశంతో హెచ్ సియులో సంబురాలు

**ఢిల్లీ, మహా:** కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు .. కీలక ఆదేశాలు జారీ చేసింది.

మిగతా 2లో



### ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నేతల చిత్ర పటాలకు పాలాభిషేకం

02

## ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీం కీలక నిర్ణయం

- సంయమనం పాటిస్తున్నాం, మీరు పాటించాలన్న కోర్టు
- 8 వారాల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలన్న డిఫెన్స్ న్యాయవాది



**మహా :** ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీం కోర్టులో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. వరుసగా రెండో రోజు జరిగిన విచారణలో భాగంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ బెంచ్ ఎదుట స్పీకర్ కార్యదర్శి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాల పరిమితి విధింపుపై ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవన్నారు.

మిగతా 3లో

### హెచ్‌సీయూ విద్యార్థుల విజయం

**సుప్రీం తీర్పుపై కేటీఆర్**



**హైదరాబాద్ :** కంచ గచ్చిబౌలి పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

మిగతా 2లో

### పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి

నాగర్ కర్నూలు జిల్లాలో ఘటన

వివరాలు 3లో



## నటిగా రీఎంట్రీ ఇవ్వనున్న కేంద్ర మాజీ మంత్రి..?

- రాజకీయల్లోకి రాకముందు సినీ, సీరియల్ నటిగా వినోదాన్ని పంచిన స్మృతి ఇరానీ
- త్వరలోనే ఒక వెబ్ సిరీస్ కోసం పనిచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు

**మహా:** రాజకీయాల్లోకి రాకముందు సినీ, సీరియల్ నటిగా ప్రేక్షకులకు వినోదాన్ని పంచిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ త్వరలో మళ్ళీ తెరంగేట్రం చేయబోతున్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి . రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుంచి ఆమె యాక్టింగ్‌కు దూరంగా ఉండగా, తాజా సమాచారం ప్రకారం ఆమె తిరిగి నటించనున్నారు. త్వరలోనే ఆమె ఒక వెబ్ సిరీస్ కోసం పనిచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు ప్రచురితమవుతున్నాయి.


## హైదరాబాద్‌లో కుండపోత

**అధికారులను అలర్ట్ చేసిన సీఎం రేవంత్**

**ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశం**



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలని, ట్రాఫిక్ సమస్యను త్వరగా క్లియర్ చేయాలని అన్నారు. జిల్లాల్లోనూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కుండపోత వర్షాలతో హైదరాబాద్ సిటీలోని అన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి.



## మోదీ జీ.. ఇది మీ కారణంగానే సాధ్యమైంది

- టారిఫ్ మినహాయింపుల వల్ల ఫార్మా ఎగుమతులు పెరుగుతాయి
- బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథిరెడ్డి

**ఢిల్లీ, మహా:** ఫార్మా ఉత్పత్తులపై కొత్తగా అమల్లోకి రాబోతున్న యూఎస్ టారిఫ్ ల నుంచి మినహాయింపు రావడంపై హెటిరో డ్రగ్స్ అధినేత, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. యూఎస్ టారిఫ్‌ల నుంచి ఫార్మా ఉత్పత్తులకు మినహాయింపు రావడానికి ప్రధాని మోదీనే కారణమన్నారు. 'మోదీ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైంది. టారిఫ్ మినహాయింపుల వల్ల ఫార్మా ఎగుమతులు పెరుగుతాయి. దీని వల్ల దేశానికి మరింత లాభం చేకూరుతుంది' అని లేఖలో పేర్కొన్నారు.

## హెచ్‌సీయూ విద్యార్థుల విజయం

**సుప్రీం తీర్పుపై కేటీఆర్**

(మొదటి పేజీ తరువాయి)

ఇది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల విజయం. విద్యార్థుల నిస్వార్థ నిరంతర స్ఫూర్తివంతమైన పోరాటం వల్లనే ఈ సానుకూల తీర్పు వచ్చింది. కంచ గచ్చిబౌలి భూముల పరిరక్షణ కోసం మద్దతు ఇచ్చిన ఉద్యమకారులు, సెలబ్రెటీలు, పర్యావరణ ప్రేమికులు, మీడియా, సోషల్ మీడియా.. ప్రతి ఒక్కరికీ విద్యార్థుల తరపున ధన్యవాదాలు అని కేటీఆర్ పేర్కొన్నారు.



# తెలంగాణ ప్రజలు చేసిన మేలు మరువరు

## ప్రజలు ఎపుడూ కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్ల అంశంపై జంతర్ మంతర్‌లో పాల్గొన్నట్లు సోనియాకు విప్ ఆది శ్రీనివాస్ వివరించారు.

**రాహుల్ గాంధీతో మహేష్ గౌడ్ చర్చలు**

బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వంతో బలంగా కొట్లాడుతామని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర వైఖరిని మీరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బిసి రిజర్వేషన్ల బిల్లు, ఢిల్లీ ధర్నా అంశాలను రాహుల్‌కు పార్ల



మెంట్ హాల్ లో కలిసి మహేష్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న అంశంపై రాహుల్ అభినందించారు. సోనియా , రాహుల్ గాంధీలతో భేటీ అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

**మంత్రివర్గ విస్తరణపై సుదీర్ఘ చర్చ..**

తమ అభిప్రాయాలను సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు తీసుకున్నారని.. తగిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముస్లింలను అడ్డంపెట్టుకుని బీసీలకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గుజరాత్‌లో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని.. మోదీ సీఎంగా ఉన్నప్పుడు కూడా అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో పాటు రాజకీయ, విద్య, ఉద్యోగాలు రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించామని తెలిపారు. బీసీ కుల సంఘాల నేతృత్వంలో జంతర్ మంతర్‌లో ధర్నా చేశామని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

**రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉన్నాం..**

కాంగ్రెస్ చిత్తశుద్ధితో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ఆమోదం తెలిపిందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఓబీసీలు తెలంగాణలో 56 శాతం ఉన్నారని లెక్క తేలిందని అన్నారు. అన్ని కుల సంఘాలు చేసిన ధర్నాకు 18 పార్టీల నేతలు మద్దతు తెలిపారని చెప్పారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఇవాళ కలిశామని రాష్ట్ర అంశాలను వివరించామని అన్నారు. బీజేపీ నేతలు జంతర్ మంతర్ ధర్నాకు రాకుండా మొఖం చాటేశారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. 9వ షెడ్యూల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రధాని మోదీని తెలంగాణ బీజేపీ నేతలు ఒప్పించాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి : సోనియాగాంధీ

వక్ఫ్ సవరణ బిల్లు- 2025పై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో సమాజంలో శాశ్వత విభజనను తీసుకురావడానికి భాజపా ప్రయత్నిస్తుందని విమర్శించారు. గురువారం సంవిధాన్ సదన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పార్టీ ఎంపీలను ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడారు. 'వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి చేయడమే. దిగువ సభలో ఈ బిల్లును తొక్కేశారు. మోదీ ప్రభుత్వం విద్య, పౌర హక్కులు, స్వేచ్ఛ, సమాఖ్య నిర్మాణం, ఎన్నికల నిర్వహణ ఏదైనా దేశాన్ని అగాధంలోకి లాగుతోంది. రాజ్యాంగం అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. దాన్ని కూడా కూల్చేయాలనేదే వారి ఉద్దేశమని మాకు తెలుసు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను, వారి ఉద్దేశాలను బహిర్గతం చేయాలి. ఏది సరైనది, ఏది న్యాయబద్ధమైనది అనేది ప్రజలకు తెలియజేసేందుకు అందరం కలిసి మన పోరాటాన్ని కొనసాగించాలి' అని సోనియా పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికే ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. దీన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు.

# చైనాతో ఆ వేడుకలేంటి!

## లోక్ సభలో ప్రశ్నించిన రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లో 4వేల చదరపు కిలోమీటర్ల భా భూభాగాన్ని చైనా ఆక్రమించిందని వ్యాఖ్యానించారు. తాము సరిహద్దుల్లో సాధారణ స్థితికి వ్యతిరేకం కాదనీ, అయితే గల్వాన్ ఘర్షణలకు ముందున్న యథాతథ స్థితి ఉండాలని స్పష్టం చేశారు.

**'ట్రంప్ టారిఫ్‌ల వల్ల మనకే చేటు'**

మన భూమిని మనం తిరిగి సాధించాలని రాహుల్ గాంధీ అన్నారు. విదేశాంగ విధానంలో ఇందిరాగాంధీ లెఫ్ట్, రైట్ లలో ఏదో ఒక వైపు కాకుండా నిటారుగా ఉన్నారని రాహుల్ తెలిపారు. అయితే ఇప్పటి బీజేపీ, ఆరెస్సెస్ మాత్రం తమ ముందుకు వచ్చే ప్రతీ విదేశీ శక్తికి తల వంచడమే విధానంగా పెట్టుకున్నాయని విమర్శించారు. తలవంచడం వారి చరిత్రలోనే ఉందన్నారు అమెరికా విధించిన టారిఫ్‌ల వల్ల మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందనీ, ఈ అంశంలో ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని రాహుల్ ప్రశ్నించారు.

**'చైనాతో అలా వ్యవహరించడం దిగ్భ్రాంతికి గురిచేసింది'**

"ఇటీవల మన విదేశాంగశాఖ కార్యదర్శి (విక్రమ్ మిస్రి), చైనా రాయబారితో కలిసి కేకును కట్ చే



యడాన్ని చూసి నేను దిగ్భ్రాంతి చెందాను. మన భూభాగంలో అసలేం జరుగుతోందనేది ప్రశ్న. 20 మంది వీర జవానులు అమరులయ్యారు (గల్వాన్ లోయ ఘర్షణ). వారి త్యాగాలపై కేక్‌ను కట్ చేసి వేడుకలు చేసుకుంటున్నారు. ప్రధానితో పాటు రాష్ట్రపతి చైనాకు లేఖ రాశారని మాకు సమాచారం తెలిసింది. ఇది మన అధికారులు మనకు చెప్పలేదు. ప్రధాని, రాష్ట్రపతులు లేఖలు రాసినట్లు చైనా రాయబారి చెబితే మనకు తెలిసింది. మరోవైపు మన మిత్రదేశమైన అమెరికా మన ఉత్పత్తులపై 26శాతం సుంకాలు విధించాలని ఒక్కసారిగా నిర్ణయించింది. ఇది మన ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తుంది. మన ఆటో, ఔషధ, వ్యవసాయ రంగాలు కూడా జాబితాలో ఉన్నాయి. మన భూభాగంతో పాటు మిత్ర దేశం అమెరికా విధించిన టారిఫ్‌ల విషయంలో మీరు ఏం చేస్తున్నారనే అంశాలపై మాకు జవాబు కావాలి." అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.

# హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

## మరోసారి పార్లమెంటులో గలమెత్తిన :ఎంపీ రవిచంద్ర



**ఖమ్మం మహా:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విలువైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయు)భూములు అన్యాక్రాంతం కాకుండా,వాటి పరిరక్షణకు తన వంతు కృషి సల్పుతున్నారు. గచ్చిబౌలి వద్ద నెలకొన్న ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఉన్న భూముల్లో 400 ఎకరాలను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాల్సిందిగా కేంద్రాన్ని మరో సారి కోరారు.అత్యంత విలువైన ఈ భూములను పరిరక్షించాల్సిన అవసరం గురించి మొన్న రాజ్యసభలో మాట్లాడిన ఎంపీ రవిచంద్ర, నిన్న సహచర ఎంపీలు, బీఆర్ఎస్ నాయకులతో పాటు సంబంధిత శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేయడం తెలిసిందే. అలాగే, ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో యూనివర్సిటీ భూముల అంశాన్ని తిరిగి లేవనెత్తారు.ఈ సందర్భంలో కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవాలని చూసినా కూడా ఆయన ఏ మాత్రం వెనుకడు వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు వైఖరిని ఎండగట్టారు.విద్యా,పరిశోధనా, నైపుణ్యాభివృద్ధికి,విద్యార్థుల భవిష్యత్తు అవసరాల కోసం యూనివర్సిటీకి చెందిన విలువైన ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, మనందరిపై ఉందని ఎంపీ వద్దిరాజు అన్నారు.హెచ్ సీయు క్యాంపస్ లోని ఈ భూముల్లో నీటి వనరులతో పాటు అరుదైన వృక్ష సంపద,పక్షి జాతులు,భారీ రాళ్ల వరుసలు, జింకలు,మన జాతీయ పక్షి అయిన నెమళ్లు,తాబేళ్లు, సరీసృపాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, వాటి మనుగడకు ప్రమాదం వాటిల్లుతున్నదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.చక్కని జీవవైవిధ్యంతో కూడిన ఇక్కడ నుంచే కాంక్రీట్ జంగల్ గా మారిన పరిసర ప్రాంతాలకు సహజ వాయువు లభిస్తున్నదని తెలిపారు. ఇటువంటి భూముల్ని వేలం వేసేందుకు గాను అందులో ఉన్న భారీ వృక్షాలను రాత్రిపగలు అనే తేడా లేకుండా జేసీబీలు,ప్రొక్లైనర్లతో యధేచ్ఛగా నర్కేస్తున్నారని, వద్దని అడ్డుపడుతున్న విద్యార్థులు,అధ్యాపకులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తూ భయాందోళన సృష్టిస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను కూడా సభకు సమర్పిస్తానని ఆయన తెలిపారు.కూడా చెట్లను నర్కేస్తు పచ్చదనాన్ని, పర్యావరణాన్ని విధ్వంసం చేసే హక్కు ఎవరికి కూడా లేదని,ఈ భూములను వేలం వేయకుండా, అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేశారు

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్

**కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు.. నేతల చిత్ర పటాలకు పాలాభిషేకం**



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ కు అనుమతులు రావడంతో తామంతా హర్షం వ్యక్తం చేస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. అసెంబ్లీ లో సీయం రేవంత్ రెడ్డి ప్రకటించి మరీ సాధించారని తెలిపారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మంత్రి సీతక్క చొరవతో ఈ విషయంలో లేఖల ద్వారా ఇరు ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించినట్టు వివరించారు. మొత్తానికి ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్ రావడంతో గురువారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో సీయం రేవంత్ రెడ్డి,జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క,కంది శ్రీనివాస రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,ఐ.ఎన్.టి.యూ.సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,జాఫర్ అహ్మద్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,తిరుమని మహేందర్,సుధాకర్ గౌడ్,దొగ్గలి రాజేశ్వర్,అడ్డి రూకేష్‌రెడ్డి,సాహెబ్రావు,ఎం.ఏ కయ్యుమ్,రాజా లింగన్న,శ్రీనివాస్ రెడ్డి,రాహుల్,గేడం రాస్పత్ పాల్గొన్నారు.

# పనులు ఆపండి



(మొదటి పేజీ తరువాయి)

తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు చర్యలు నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని తెలిపింది. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఇదే అంశంపై గురువారం ఉదయం అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటల్లోగా నివేదిక అందించాలని ఆదేశించింది. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలో ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమి అని ఆధారాలు లేవని కోర్టుకు తెలిపారు. తాజాగా మరోసారి ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ చర్యలు అన్నీ నిలుపుదల చేయాలని ఆదేశించింది.

**హెచ్ సియులో సంబురాలు**

చెట్లు కొట్టడం, ప్రభుత్వ చర్యలు కంచె గచ్చిబౌలి ప్రాంతంలో నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో హెచ్ సియులో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆనందాన్ని చాటారు. నిరసలు ఆపి యూనివర్శిటీ ప్రాంగంణంలో విజయం సాధించామంటూ నినాదాలు చేశారు.

**ప్రభుత్వానికి చెంపదెబ్బ: రఘునందన్‌రావు**

హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. "యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిది" అని రఘునందన్ పేర్కొన్నారు.



# కేసీఆర్‌వి పగటికలలు

## రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీనే ఉండదు

### ఢిల్లీలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)

లక్షల కోట్ల అప్పుల్లో ముంచి తెలంగాణను నాశనం చేసిన వ్యక్తి కేటీఆర్. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీనే ఉండదు అంటూ వ్యాఖ్యలు చేశారు.

**మంత్రివర్గంలోకి ఇద్దరు బీసీలు**

మంత్రి వర్గ విస్తరణ ఏఐసీసీ పరిధిలో ఉంది. ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని కోరాం. మొత్తం మంత్రి వర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. మంత్రి వర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ప్రాంతాలు, కులాల వారీగా చూడాల్సిన అవసరం ఉంది. త్వరలోనే ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుంది. మంత్రి వర్గ విస్తరణలో మైనార్టీకి అవకాశం ఉంటుంది అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు.

**ఏపీలో రిజర్వేషన్లు తొలగించే దమ్ముందా?**

ఢిల్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..'ఈడబ్ల్యూఎస్ కింద ముస్లింలకి బీజేపీ రిజర్వేషన్లను ఇస్తోంది. ఏపీ నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఆ రిజర్వేషన్లను తొలగించే దమ్ము బీజేపీకి ఉందా?. 70 ముస్లిం తెగలకు రిజర్వేషన్లు ఇచ్చామని గతంలోనే నరేంద్ర మోదీ చెప్పారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ ఎందుకు అడ్డుకుంటుంది అని ప్రశ్నించారు.

# మళ్లీ మనదే అధికారం

## అందరం బ్రహ్మాండంగా గెలుస్తాం.. వార్ వన్ సైడే.. కరీంనగర్, ఆదిలాబాద్ నేతలతో కేసీఆర్

**హైదరాబాద్, మహా:** పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ గ్రోక్‌ను వాడాలని.. టెక్నాలజీని వినియోగించుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. ఎప్పటికప్పుడు సాంకేతికంగా అప్‌డేట్ అవ్వాలన్నారు. గ్రోక్‌లో ఎలాంటి సమాచారం అయినా దొరుకుతుందని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో గురువారం పార్టీ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. పలు అంశాలపై రెండు జిల్లాల ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లోనే ఉండాలని.. ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ మనదే అధికారమని.. అందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని కేసీఆర్ చెప్పారు. ఉత్తర తెలంగాణలో కొన్నిచోట్ల మాత్రమే బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటాపోటీ ఉంటుందని.. కాంగ్రెస్ ఏ కోశాన కూడా పోటీలో ఉండదని అన్నారు. అన్ని నియోజకవర్గాలు



సైతం బలంగా ఉన్నాయని.. అందరం బ్రహ్మాండంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వార్ వన్ సైడ్ ఉండక తప్పదన్నారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా ఇంతటి వ్యతిరేకతను మూటగట్టుకోలేదని.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతటి వ్యతిరేకత వచ్చిందని చెప్పారు.

**శిక్షణా తరగతులు**

బీఆర్ఎస్ బహిరంగ సభ కార్యక్రమం ముగిసిన వెంటనే నియోజకవర్గాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రత్యేక నిపుణులతో ఈ శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. అలాగే.. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. అందులోభాగంగానే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ఇప్పటికే సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతూనే ఉన్నదని.. సభ తర్వాత కమిటీలను ఫైనల్ చేసుకుందామని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు డా.కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జోగు రామన్న (ఆదిలాబాద్), బాల్క సుమన్ (మంచిర్యాల), మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్టా మధు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్‌రావు, పార్టీ జిల్లాల నాయకులు దావ వసంత, చల్మెడ లక్ష్మీనరసింహారావు, జాన్సన్ నాయక్, రామకృష్ణారెడ్డి, రమాదేవి, కిరణ్ కొమ్మెర, విలాస్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పై 14 ఏళ్ల నాటి కేసు

## కొట్టివేసిన హైకోర్టు

### ఉద్యమ సమయంలో 2011లో రైల్ రోకో కేసు

**మహా :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. ఉద్యమ సమయంలో ఆయనపై నమోదైన రైల్ రోకో కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. 2011 అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్ రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు నమోదు చేసి పలువురిని అరెస్టు చేశారు. ఈ కేసు ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉండగా, కేసీఆర్ పిలుపు మేరకు రైల్ రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. అయితే, రైల్ రోకో జరిగిన సమయంలో కేసీఆర్ అక్కడ



లేరని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం, కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఈ కేసులో స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోకపోవటంపైన సుప్రీం కీలక అంశాలను ప్రస్తావన చేసింది. రెండో రోజు విచారణలో భాగంగా అసెంబ్లీ న్యాయవాది సింఘ్వీ పలు అంశాలను కోర్టుకు నివేదించారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీం కోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ రోజు విచారణలో ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలపై గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీనికి స్పందించిన అభిషేక్ మను సింఘ్వి ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు.



మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడి వరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం పేర్కొన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి

## నాగర్ కర్నూలు జిల్లాలో ఘటన



**మహా :** హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. అయితే అనూహ్యంగా వచ్చిన ఈ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పదర మండలం కూడన్‌పల్లి సమీపంలో పిడుగు పాటుకు గురై ఇద్దరు మహిళలు మృతి చెందారు. మృతి చెందిన వారిని ఈదమ్మ (55), సైదమ్మ (35) గా గుర్తించారు. మరికొందరికి సైతం గాయలవగా వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేరుశనగ పొలాల్లో కూలీ పనులు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్టు చెబుతున్నారు. పనికోసం వెళ్లిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో మృతుల కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరి మరణంతో స్థానికంగా విషాదం నెలకొంది.


**ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# వక్ఫ్ బోర్డుపై తెలంగాణ హైకోర్టు సీరియస్

## తీర్పులనే ఉల్లంఘిస్తారా అంటూ నిలదీత

**మహా :** దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుపై చర్చ జరుగుతున్న వేళ దాని తీరుపై తెలంగాణ హైకోర్టు సీరియస్ అయ్యింది. దివ్య ఖురాన్ స్ఫూర్తిని వక్ఫ్ బోర్డు విస్మరించిందని జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను వక్ఫ్ బోర్డు అమలు చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. పేదల పక్షాన వక్ఫ్ బోర్డు పనిచేయట్లేదని జస్టిస్ నగేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్‌లోని పేరాలను జస్టిస్ నగేశ్ భీమపాక ఉటంకించారు. పాదరక్షలు విడిచి ఖురాన్‌లోని అంశాలు చదివి వినిపించారు. అలాగే పిటిషనర్లు సైతం ఖురాన్ స్ఫూర్తిని మరిచిపోయారని వ్యాఖ్యానించారు.



వక్ఫ్‌బోర్డుపై హైకోర్టులో గతేడాది పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ముఖ్యంగా ఇబాదత్‌ఖానాను స్వాధీనం చేసుకోవాలని పిటిషినర్ కోర్టును ఆశ్రయించారు. అయితే ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం, గతేడాది మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇబాదత్ ఖానాను స్వాధీనం చేసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఇబాదత్ ఖానా నిర్వహణకు కమిటీ వేయాలని సూచించింది. ఈ నిర్వహణ కమిటీలో ఈక్వల్ మెంబర్స్‌కు చోటు కల్పించాలని ఆదేశించింది. అయితే హైకోర్టు ఇచ్చిన తీర్పును వక్ఫ్ బోర్డు పెడచెవిన పెట్టింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది. దీనిపై పిటిషనర్ మరోసారి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. వక్ఫ్ బోర్డు తీరుపై మండిపడింది.

శ్రీరామనవమి మరియు పట్టాభిషేక మహోత్సవము - భద్రాచలం
పూర్తి సమాచారం కొరకు ఈ క్రింది QR CODE ను స్కాన్ చేయగలరు
SCAN THIS QR CODE
https://bhadrachalam.netlify.app

# స్కాన్ చేస్తే...

## చేతిలో సమాచారం

**మహా భద్రాచలం :** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 6,7 వ తేదీలలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణం, మహా పట్టాభిషేకం కార్యక్రమాలను తిలకించిడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాలు నుండి లక్షలాది మంది భక్తులు భద్రాచలం వస్తారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ, సమాచార శాఖ ఆధ్వర్యంలో ఒక క్యూ ఆర్ కోడ్ రిలీజ్ చేశారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు భద్రాచలంలో భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు అన్ని తెలుస్థాయి. భక్తులకోసం ఏర్పాటు చేసిన వసతి, ప్రసాదాల కౌంటర్లు, తలంబ్రాల కౌంటర్లు, ఉచిత వైద్య శిబిరం, వాష్ రూమ్స్, దర్శనం, ఇలా అన్ని విషయాలు ఆ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుస్థాయి. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ క్యూఆర్ కోడ్ వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

## మూడు రోజులుంటాయన్న వాతావరణ శాఖ

అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం.. భారీ వర్షానికి హైదరాబాద్ అతలాకుతలం

పలు చోట్ల ట్రాఫిక్ జాం.. రోడ్లపై నిలిచిన వరద నీరు

కారుపై కూలిన వృక్షం.. ప్రమాదం నుంచి బయటపడ్డ ఇద్దరు మహిళలు

**మహా :** హైదరాబాద్ నగరంలో గురువారం మధ్యాహ్నం దాదాపు గంటపాటు వర్షం దంచి కొట్టింది. భారీగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. నగరంలో వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ నిలిచిపోయింది. గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షం కాస్త తగ్గినప్పటికీ ముసురు వీడలేదు. భారీగా కురిసిన వర్షానికి తెలంగాణ సెక్రటేరియట్ ముందు రహదారులు చెరువును తలిపించాయి. రహదారులపై భారీగా నీరు చేరడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ స్థంబించింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. ఖైరతాబాద్‌లో ప్రధాన రహదారిపై వరదనీరు భారీగా నిలిచింది. ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే వాహనాలు ట్రాఫిక్ పోలీసులు దారిమళ్లిస్తున్నారు. తాజ్‌కృష్ణా వైపు వాహనాలు మళ్లిస్తున్నారు. ఖైరతాబాద్‌లో మెర్క్యూరి హోటల్ వద్ద కారుపై చెట్టు కూలింది. ప్రమాదం నుంచి ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. పలు చోట్ల ఈదురు గాలులకు చెట్లు నెలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బేగంపేట, ఖైరతాబాద్, పంజాగుట్ట ప్రధాన మార్గల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ కేంద్రం సూచనల మేరకు వచ్చే 3 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

**ట్రాఫిక్ అంతరాయం**

సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. బోయిన్ పల్లి, తిరుమలగిరి, బౌద్ధ నగర్, రామ్ గోపాల్ పేట, రాణిగంజ్, బేగంపేట్, ప్యాట్నీ, అల్వాల్ ప్రాంతాలలో రహదా



రులపై వరద నీరు ప్రవహిస్తుంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మోకాళ్ల లోతు నీరు రావడంతో పాటు వాహనాలు వెళ్లేందుకు సైతం వీలుకాక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రధాన కూడళ్లలో రహదారులపై ఎక్కడికక్కడే నీరు నిలిచి ఉండడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే రహదారులపై నిలిచి ఉన్న నీటితో పాటు మున్సిపల్ సిబ్బంది తొలగించే ప్రయత్నం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

హైదరాబాద్ చంపాపేట, సైదాబాద్, దిల్ సుఖ్ నగర్, ఓవైసీ చౌరస్తా, మలక్‌పేట్, సంతోష్ నగర్, చాదర్ ఘాట్,సరూర్ నగర్, కర్మన్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో చాదర్ ఘాట్ రైల్వే ట్రాక్ కింద వర్షపు నీరు నిలవడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రాకపోకలు ఆగిపోయాయి.

**ముఖ్యమంత్రి ఆదేశాలు**

హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ట్రాఫిక్, విద్యుత్ సమస్యలను త్వరగా క్లియర్ చేయాలని సూచించారు. జిల్లాల్లోనూ కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



# చార్మినార్ నుంచి ఊడిపడిన పెచ్చులు

## పరుగులు పెట్టిన పర్యాటకులు

**మహా :** ప్రముఖ చారిత్రక కట్టడం చార్మినార్ నుంచి గురువారంపెచ్చులు ఊడిపడ్డాయి. చార్మినార్‌ను ఆనుకొని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం వైపు ఊడిన పెచ్చులు పడ్డాయి. దీంతో పర్యాటకులు భయంతో పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు.. పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గతంలోనూ పెచ్చులు ఊడితే అధికారులు మరమ్మతులు చేశారు. దాదాపు న400 వందల ఏళ్ళ క్రితం నిర్మించిన పురాతన కట్టడమైన చార్మినార్ ను పరిరక్షించేందుకు పురావస్తు శాఖ ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేస్తుంది, అయినా తరచూ పెచ్చులు ఊడిపడుతుండటంతో స్థానికులతో పాటు, పర్యాటకులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు.

# కాంగ్రెస్ అసమర్ధత పాలనపై సమరమే..

## స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమం సాగిస్తాం


### బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి

**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా ధర్మారంలోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన బిజెపి జిల్లా స్థాయి పదాధికారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఉద్యమ కార్యచరణ రూపొందించి ముందుకు వెళ్లాలని బిజెపి నిర్ణయించి, రైతు వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ, యువత ఇలా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాడాలని తీర్మానించి, రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగున నిలదీసి ఒత్తిడి తీసుకువచ్చేలా ఆయా అంశాలపై ఆందోళన నిరసనలకు సిద్ధం కావాలని తీర్మానించారు. కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేరుస్తూ, అనుక్షణం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ.. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ పార్టీ అని గుర్తుకు చేస్తూ, రాబోయే రోజుల్లో ఏప్రిల్ 6 తేదీన బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం తో పాటు సంస్థాగతంగా చేయవలసిన కార్యక్రమాలపై, భారత రాజకీయాల్లో బిజెపి తీసుకొచ్చిన సంస్కరణలు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గత 10 సంవత్సరాల కాలంలో వికసిత్ భారత్ దిశగా ప్రయనిస్తున్నా విధానాన్ని వివరించడం జరిగింది. త్వరలో నిర్వహించే కార్యక్రమాలపై ఏప్రిల్ 6 బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం. ఏప్రిల్ 11శ్రీ జ్యోతిరావు పూలే జయంతి. ఏప్రిల్ 14 భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలి. మండలాల, డివిజనుల వారిగా క్రియాశీలక కార్యకర్తల సమావేశాలు, గావ్ చలో, బస్తి చలో అభియాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామచందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణాప్రతాపరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, జిల్లా, మండల పదాధికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చా ప్రధాన కార్యదర్శిలు పాల్గొన్నారు.

# కంచ గచ్చిబౌలి భూముల వివాదం

## ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, మహా:** కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై మంత్రుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు, ప్రజాసంఘాలతో ఈ కమిటీ సంప్రదింపులు జరపనుంది.







# రివేంజ్ రాజా.. ట్రంప్

## 60 దేశాలపై దబిడిదిబిడి

### చైనా పై 34 శాతం.. భారత్ పై 26 శాతం..

### ప్రతీకార సుంకాలు

### భారత్ పై స్నేహ ధర్మాన్ని పాటించని ట్రంప్




(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాడు. కొత్త టారిఫ్‌లు ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పాటుగా.. అమెరికాతో వాణిజ్య భాగస్వాములుగా ఉన్న 60 దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు ట్రంప్. అన్ని దేశాలపై 10శాతం సార్వత్రిక సుంకం అమల్లో ఉంటూనే.. కొన్ని దేశాలను లక్ష్యంగా చేసుకునే నిర్దిష్ట దిగుమతి సుంకాలు విధించేందుకు రెడీ అయ్యాడు ట్రంప్. దీని ప్రకారం చూసుకుంటే.. కొన్ని దేశాలపై రెండు రకాలుగా భారం పడనుంది. ఇక ఇండియా విషయానికి వస్తే..మోదీ తనకు ప్రియ మిత్రుడే అన్న ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు అంశంలో మాత్రం స్నేహ ధర్మాన్ని పాటించలేదు. పైగా సుంకాల విషయంలో.. అమెరికాతో భారత్ తీరు సరిగా లేదని ఆరోపించారు. అయినప్పటికి తాను భారత్ మీద కేవలం 26 శాతం మాత్రమే ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. అలానే డ్రాగన్ కంట్రీ చైనా మీద 34 శాతం ప్రతీకారం సుంకం విధించాడు.

ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "నేడు అమెరికాకు పునర్జన్మ.. ఈ రోజు కోసం అమెరికా ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తోంది. అమెరికా పారిశ్రామిక రంగానికి ఈరోజు పునర్జన్మ లభించినట్లు అయ్యింది. అమెరికా మళ్లీ సుసంపన్నమైన దేశంగా అవతరించిన రోజుగా ఏప్రిల్ 2 ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుంది" అన్నాడు. ఆయా దేశాలు సుంకాలు తగ్గిస్తేనే తాము కూడా తగ్గిస్తామని ట్రంప్ స్పష్టం చేశాడు. 10 శాతం సుంకం, ప్రతీకార సుంకాలు అమల్లోకి రానుండటంతో కొన్నింటి ధరలు భారీగా పెరగనున్నాయి. అవి ఏవంటే..

**ఆటోమొబైల్స్..**

ఆటో దిగుమతులపై ట్రంప్ గతంలో ప్రకటించిన 25 శాతం సుంకంతో పాటుగా దిగుమతి చేసుకున్న వస్తువులపై విధిస్తున్న 10 శాతం జనరల్ టారిఫ్ కూడా విధించనున్నారు. కొన్ని అమెరికా నిర్మిత వాహనాల్లో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాలు ఉన్నాయి. వీటిపై టారిఫ్ ప్రభావం పడుతుంది. ఫలితంగా ఆయా కార్ల కొనుగోలు ధర భారీగా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

**బట్టలు, షూస్..**

అమెరికాలోని వాల్‌మార్ట్ వంటి స్టోర్లలో అమ్మే దుస్తులు, బూట్లలో ఎక్కువ భాగం అగ్రరాజ్యం వెలుపల అనగా చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లో తయారైనవే ఉంటాయి. ఈ మూడు దేశాలపై కూడా ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించాడు. దీనిలో భాగంగా చైనాపై 34 శాతం, వియత్నాంపై 46 శాతం, బంగ్లాదేశ్‌పై 37 శాతం టారిఫ్ విధించారు. దాంతో వీటి ధరలు భారీగా పెరగనున్నాయి..

**వైన్, స్పిరిట్స్..**

ఇటాలియన్, ఫ్రెంచ్ వైన్లు, స్కాటిష్ విస్కీ వంటి వాటి ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది అంటున్నారు. యూరోపియన్ యూనియన్ దేశాల దిగుమతులు 20 శాతం టారిఫ్‌ను ఎదుర్కొనున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్ ఉత్పత్తులు 10 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కొంటాయి. దాంతో వైన్, స్పిరిట్స్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది అంటున్నారు.

**కాఫీ, చాక్లెట్..**

ట్రంప్ నిర్ణయాల వల్ల భారీగా ధరలు పెరిగే మరో అంశం.. కాఫీ, చాక్లెట్స్. అమెరికా అధికంగా బ్రెజిల్, కొలంబియా వంటి లాటిన్ అమెరికన్ దేశాల నుంచి 80 శాతం కాఫీ గింజలు దిగుమతి చేసుకుంటుంది. ఈ రెండు దేశాల మీద కూడా టారిఫ్‌లు విధించడంతో.. అమెరికాలో కాఫీ, చాక్లెట్స్ ధరలు పెరగనున్నాయి.

**అవకాడో..**

మెక్సికన్ వాతావరణ అవకాడోల పెరుగుదలకు సరిగా సరిపోతుంది. అమెరికాకు దిగుమతి అవుతున్న అవకాడోల్లో 89 శాతం మెక్సికో నుంచే వస్తున్నాయి. అయితే అమెరికా వ్యవసాయ శాఖ.. మెక్సికో పండ్లు, కూరగాయల మీద టారిఫ్ విధిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో వీటి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది అంటున్నారు.

**ఇంధన ధరలు..**

అమెరికాకు ముడి చమురును సరఫరా చేసే అతిపెద్ద విదేశీ సరఫరాదారు కెనడా. అధికారిక వాణిజ్య గణాంకాల ప్రకారం, గత సంవత్సరం జనవరి, నవంబర్ మధ్య అమెరికా దిగుమతి చేసుకున్న చమురులో 61 శాతం కెనడా నుండి వచ్చిందని అధికారులు తెలిపారు.కెనడియన్ ఇంధనంపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. దాంతో ఇంధన ధరలు కూడా భారీగా పెరగున్నాయి.

## ట్రంప్ టారిఫ్ లతో మనకు మేలే

### టెక్స్‌టైల్, గార్మెంట్ ఇండస్ట్రీకి వరం

మహా: ట్రంప్ టారిఫ్‌ల రూపంలో టెక్స్‌టైల్, గార్మెంట్ ఇండస్ట్రీకి అవకాశం లభించినట్లు అవుతుంది. చైనా, బంగ్లాదేశ్‌పై అమెరికా విధించిన అధిక సుంకాలు భారత్ ఎగుమతులు పెంచుకునేందుకు దోహదపడనున్నాయి. తద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడానికి ఉపయోగపడనుంది. ఉత్పత్తి కేంద్రాలను ఆయా దేశాల నుంచి ఆకర్షించడం, అమెరికాకు ఎగుమతులు పెంచుకోవడం ద్వారా లబ్ధి పొందొచ్చని శ్రీవాస్తవ విశ్లేషించారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత పరిస్థితికి ముందు అమెరికాకు ఆ దేశం ప్రధాన ఎగుమతిదారుగా ఉంది. చైనా 30 శాతం, వియత్నాం 13 శాతం, భారత్ 8 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక ట్రంప్ టారిఫ్‌ల వల్ల లబ్ధి పొందేందుకు అవకాశం ఉన్న మరో రంగం ఎలక్ట్రానిక్స్ తయారీ. ఇప్పటికే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం వర్తింపజేయడం వల్ల పలు కంపెనీలు భారత్‌లో తయారీ చేపట్టాయి. స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రస్తుతం భారత్ దూసుకెళుతోంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో అగ్రగామిగా ఉన్న వియత్నాం, తైవాన్ దేశాలు సుంకాల మూలంగా కాస్ట్ అడ్వాంటేజీని కోల్పోయే అవకాశం ఉందని శ్రీవాస్తవ తెలిపారు. తైవాన్‌పై 32 శాతం సుంకాలు విధించడం వల్ల సెమీ కండక్టర్ తయారీని ఆయా కంపెనీలు తమ కార్యకలాపాలను భారత్‌కు తరలించే అవకాశం ఉందన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన మద్దతు అవసరం ఉందన్నారు. తద్వారా అమెరికా వాణిజ్య విధానాలను మనకు అనుకూలంగా మార్చుకొని గ్లోబల్ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

# భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

## ట్రంప్ దెబ్బ.. మామూలుగా ఉండదు

**మహా:** అంచనాలను మించి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాంబు వేశారు . భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ, ఫార్మా ఉత్పత్తులపై ఎఫెక్ట్ ఉండనున్నట్లు పేర్కొంటున్నారు.

**వ్యవసాయం, డెయిరీ, సీఫుడ్..**

గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం.. ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం. రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

**టెక్స్‌టైల్స్, బంగారం**

భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32 శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 202324 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మనం చేసే మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో 28 శాతం అమెరికాకే వెళ్తున్నాయి.

**చెప్పులపైనా**

పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికాభారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో కస్టమర్లు ఇతర దేశాల ఉత్పత్తులను ప్రత్యామ్నాయంగా ఎంచుకునే అవకాశం ఉంది.

**ఎలక్ట్రానిక్స్..**

ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఇక, బాయిలర్లు, టర్బైన్స్, కంప్యూటర్ల వంటి ధరలు కూడా ప్రియమవుతాయి.

# ఎమ్మెల్యే వెంకట్రావు విస్తృత పర్యటన



**వెంకటాపురం,మహా :** భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం వెంకటాపురం, వాజేడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. వాజేడు మండలం సుందరయ్య కాలనీ వాసి, హైదరాబాద్ ఫ్లై ఓవర్ నుంచి దూకి చనిపోయిన సాయి ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వెంకటాపురం మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతు ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం ద్వారా నష్టపరిహారాన్ని వచ్చే విధంగా చూస్తా అని హామి ఇచ్చారు.సీనియర్ పాత్రికేయులు తల్లి మరణించగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**కాటారం , మహా:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రధాన ఆస్పత్రిని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని టీ హబ్, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్, ఎన్.సి.డి సెంటర్, డైస్ బిల్డింగ్ ను పరిశీలించి తదుపరి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసే స్కాన్ మిషన్ కోసం ఆసుపత్రి సూపరింటెండెంట్ తో కలిసి పరిశీలిం చారు. టీ హబ్ లో ఒక గదిని ఎన్.సి.డి సెంటర్ ఏర్పాటు చేసిన గదులను గుర్తించారు. టీ హబ్ లో రోగుల పట్టికను పరిశీలించి టీ హబ్ లో జరుగుతున్న పరీక్షల గురించి ఆరా తీశారు. డ్రగ్ స్టోర్ లో నిల్వ ఉన్న మందుల గురించి వివరాలు అడిగి రిజిస్టర్ ను పరిశీలించారు. జిల్లాలో ఆసుపత్రులకు వైద్య సేవలకు వచ్చే ప్రజలకు అనుగుణంగా సీజనల్ వ్యాధుల మందులు, యాంటీ బయోటిక్స్ ఇతర అత్యవసర వ్యాక్సిన్లను, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. పక్కనే ఉన్న డైస్ బిల్డింగ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అనువుగా ఉంటుందో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో జరుగుతున్న సేవలు, సౌకర్యాలు, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. ఆసుపత్రిలో కావలసిన అవసరాలపై నివేదికలు అందించాలని ఆసుపత్రి పర్యవేక్షకుడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరిన్టెండెంట్ డాక్టర్ నవీన్ కుమార్, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి శ్రీధర్ బాబు చే సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

**కాటారం, మహా :** కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిష్టాత్మకంగా చేయబడుతున్న సన్న బియ్యం పంపిణీ పథకాన్ని శుక్రవారం కాటారం లో ప్రారంభిస్తారని మండల తహసీల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కాటారం సబ్ డివిజనల్ ఆఫీసు పరిధిలో గల మహాముత్తారం ,మలహర్, మహదేవపూర్, కాటారం, పలిమెల మండలాల లబ్ధిదారులకు శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు సన్న బియ్యం పంపిణీని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభిస్తారని, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కలెక్టర్ మయాంక్ సింగ్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసిల్దార్ నాగరాజు తెలిపారు.



# వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

■ జర్నలిస్టుల చిరకాల ఆకాంక్షను నేరవేర్చుతాం.. రాష్ట్ర మంత్రి సీతక్క

**కొత్తగూడ, మహా:** ప్రజా పాలన లోనే వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని, అదే విధంగా వర్కింగ్ జర్నలిస్టుల యొక్క చిరకాల ఆకాంక్ష అయిన ఇళ్ల స్థలాల మంజూరు సమస్యను కూడా పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం టీయూడబ్ల్యూజే (ఐజేయు) కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక శాసన సభ్యురాలు, రాష్ట్ర మంత్రి సీతక్కకు ములుగు క్యాంప్ కార్యాలయంలో ఐజేయు సభ్యులు కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించినటువంటి వర్కింగ్ జర్నలిస్టులను అన్యాయాలకు గురి చేసిన టువంటి దుస్థితి గత పాలకులదేనని, కెసిఆర్ కు వత్తాసు పలికే కొన్ని మీడియా యాజమాన్య సంస్థలతో కుమ్మక్కై మీడియా రంగాన్ని అనేక విభాగాలుగా విభజించి ఫోర్త్ ఎస్టేట్ అనే రంగాన్ని పూర్తిగా కనుమరుగు అయ్యే విధంగా వ్యవహరించిన తీరు నాటి పాలకుల పాపమేనని, కచ్చితంగా వర్కింగ్ జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే ఇళ్ల స్థలాల మంజూరు,ఆరోగ్యశ్రీ ,హెల్త్ కార్డుల మంజూరు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో విధి విధానాలు చేపడుతున్నామని, కచ్చితంగా వర్కింగ్ జర్నలిస్టులకు చిరకాల ఆకాంక్ష కోరికైన ఇళ్ల స్థలాల మంజూరుకు కచ్చితంగా తన వంతు కృషి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) కొత్తగూడ మండల అధ్యక్షుడు ఎస్. కె .సల్మాన్ పాషా, జిల్లా నాయకులు శెట్టి పరశురాం, మహమ్మద్ అజ్మీర్, మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్, దేశ వెంకటేశ్వర్లు, మండల ప్రచార కార్యదర్శిలు తీగల ప్రేమ్ సాగర్, ఈక నరేష్, ఉబ్బని శ్రీహరి, గంగిశెట్టి రాకేష్ వర్మ, ముఖ్య సలహాదారులు బొజ్జ సునీల్, యూనియన్ నాయకులు చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్, తాటి సుదర్శన్, బిక్షపతి, గట్టి సుధాకర్, అశోక్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్, మహా:** మహబూబా బాద్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి, ఇతర అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని ప్రశంసించారు. వెట్టి చాకిరీ, దోపిడీలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, యువత ఆయన సాహసాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి. నరసింహస్వామి, మైనారిటీ మరియు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు బి. శ్రీనివాసరావు, శ్రీనివాస్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో వైద్య సిబ్బంది

# అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్



**కాటారం , మహా:** వేసవిలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వడద గురి కాకుండా చేర్చాల్సిన చర్యలపై ప్రజలకు ఆశ సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు గురువారం ఆశాడే, అత్యవసర సేవలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురైతే చికిత్స కోసం వారిస్ ప్యాకెట్లు అందుదుబాటులో ఉంటారని రాబోయే వర్షాకాలం ముందే చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలను సూచించారు. ఆషా డే సందర్భంగా ఆశ ఏఎన్ఎంలకు 108, 102 సర్వీసెస్ ల ఎలా ఉపయోగపడుతాయ నే విషయం పై అవగాహన కల్పించారు. వేసవికాలం లో వడదెబ్బ గురయిన వారికి ప్రథమ చికిత్స చేయాలి? అంబులెన్స్ లో వడదెబ్బకు సంబంధించిన ఫస్ట్ ఎయిడ్ కిట్, ఐస్ ప్యాక్స్ చిల్లర్ బాక్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎటువంటి అత్యవసర సేవలకైన 108,102 ఎన్ సి పి, ఎం సి చెక్ అప్స్, డెలివరీ అయిన తర్వాత హాస్పిటల్ నుండి ఇంటికి మదర్ అండ్ చైల్డ్ డ్రా బ్యాక్ జాగ్రత్తగా ఇంటి వద్దకి చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మధుసూదన్ , 108 /102 డిస్టిక్ మేనేజర్ మెరుగు నరేష్, వైద్యాధికారి మౌనిక, హాస్పటల్ సిబ్బంది 108 స్టాఫ్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీకాంత్, పైలట్ విజేందర్ పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్



**మహబూబాబాద్,మహా:** మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి, చిన్నగూడురు మండలాల్లో గురువారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాలతో పాటు రేషన్ దుకాణాలను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన 'రాజీవ్ యువ శక్తి' పథకం ద్వారా ఆన్లైన్, ఆఫ్లైన్‌లో అందిన దరఖాస్తుల వివరాలను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన ధృవీకరణ పత్రాలను వేగంగా అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దంతాలపల్లి ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.రేషన్ దుకాణాల తనిఖీలో భాగంగా బీరిశెట్టిగూడెం, జయ్యారాల్లో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని సమీక్షించారు. పంపిణీ వ్యవస్థ నిరంతర పర్యవేక్షణలో ఉండేలా చూడాలని సూచించారు. రేషన్ బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటా ప్రకారం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి, సన్న బియ్యం పంపిణీలో లోపాలు ఉండకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీల్లో మండల ప్రజా పరిషత్ అధికారులు, తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణ రీ సర్వే చేయాలి

### భూములు కోల్పోతున్న జాబితాను చదివిన అధికారులు



**కాటారం, మహా :** చిన్న కాళేశ్వర పథకంలో కాలువల నిర్మాణం కోసం కాటారం మండలంలోని గుమ్మల్లపల్లి గ్రామపంచాయతీలో భూ సేకరణ పై రీ సర్వే చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుమ్మలపెల్లిలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అధ్యక్షతన తహసిల్దార్ నాగరాజు ఇతర శాఖల అధికారులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లో అధివరం పేట, గుమ్మలపల్లి, ఒడిపిలవంచ, వీరాపూర్, రఘుపల్లి, జాదరావు పేట గ్రామాల కు అధివరంపేట సిస్టెర్న్ కింద ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల తవ్వకం కోసం అవసరమైన 45 ఎకరాల 39 గుంటల భూమి అవసరం ఉంది. కాలువ తవ్వకం కోసం చేసిన భూ సర్వేలో మొఖా మీద సాగు చేస్తున్న పట్టా కలిగిన రైతులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని, కొందరి రైతుల భూమి పోకున్నప్పటికీ పేర్లు వచ్చినట్లు లబ్ధిదారులు ఆరోపించారు. గ్రామ సభలో తహసిల్దార్ నాగరాజు నిర్వాసితుల జాబితా ను పదవి వినిపించారు. సమస్యలు, సందేహాల పై దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ సూచించారు.

# గంజాయితో పోలీసులకు చిక్కిన యువకుడు అరెస్ట్

### కేసు నమోదు,16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

**హన్మకొండ, మహా:** హన్మకొండ పోలీస్ వారు బుధవారం ఉదయం హన్మకొండ బస్టాండ్ సర్కిల్ వద్ద ఓ యువకుడు ఒక్క లగేజ్ బ్యాగు పట్టుకొని అనుమానంగా ఉండి పోలీస్ వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నం చేయగా యస్.ఐ. కె. కిశోర్ తన సిబ్బందితో అతనిని అదుపులోకి తీసుకొని బ్యాగును తెరిచి చూడగా 12 ప్యాకెట్స్ ఎండు గంజాయి ఉండగా స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తీసుక రాగా హన్మకొండ అడ్మిన్ యస్.ఐ కె. అశోక్ కుమార్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ వ్యక్తిని గురువారం ఉదయం రిమాండ్ పై కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. వివరాల్లోకెళ్తే.. నేరస్థుని పేరు గౌతమ్ భరత్ సింధే, తండ్రి: భరత్ సింధే, వయస్సు: 23 సంవత్సరాలు, కులం: OBC (సింధే), వృత్తి: లేబర్, R/O: ఫాదర్ జార్జ్, డోస్ బోస్కో విశ్వామిత్రి, స్నేహాలయ, మహిళా కళాశాల, వడోదరా, గుజరాత్ ప్రస్తుతం బైరాజీకి వాడి, డిల్లీ గెట్ పార్కింగ్ సూరత్, గుజరాత్ స్టేట్, నేరస్తుని తల్లిదండ్రులు చనిపోయారు. పై నెరస్థుని నుండి స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు.. 1) 16 కిలోల ఎండు గంజాయి 2) 12 పోలీసులు నేరస్థున్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరస్థుడు, ప్రయాణిస్తున్న రైళ్లలో సమోసాలూ అమ్ముతుండగా 6 నెలల క్రితం A2 ముంబై చెందిన అర్జున్ సమోసాలూ అమ్మితే ఎన్ని డబ్బులు అర్జున్ నేను చెప్పినట్లు చేస్తే నీకు 5000/ రూపాయలు ఇస్తాను అని చెప్పగా నేను ఆశపడి సరే అన్నాను. అందుకు అర్జున్ నేను నీకు ఒక్క గంజాయి ఉన్న బ్యాగ్ ఇస్తాను నేను చెప్పిన రైల్వే స్టేషన్కు తీసుక వెళ్ళి ఇవ్వాలి అని చెప్పగా నేను ఈ పని చేయడానికి అంగీకరించాను. మొదటగా నవంబర్ నెలలో అర్జున్ సూరత్ కు వచ్చి నన్ను ఒడిశాలోని బాలుగం రైల్వే స్టేషన్లో వెళ్ళితే అక్కడ నెహ్రూ బాయి ఒక్క గంజాయి ఉన్న బ్యాగు ముంబైకి తీసుకొని వచ్చాడు. అందుకు అర్జునికి యిచ్చినాను నాకు 5000/ ఇచ్చాడు. ఆ తరువాత 4 రోజుల క్రితం అర్జున్ నాకు ఫోన్ చేసి ఒడిశాలోని బాలుగం రైల్వే స్టేషన్లో వెళ్ళితే అక్కడ నెహ్రూ బాయి గంజాయి బ్యాగు ఇస్తాడు తీసుకొని రమ్మనగా నేను బుధవారం ఒడిశాలోని బాలుగంకు వెళ్ళి, గురువారం నెహ్రూ బాయి ఒక్క గంజాయి ఉన్న బ్యాగ్ ఇవ్వగా దీనిని కోణార్క్ ఎక్స్ ప్రెస్ లో తీసుకొని వస్తుండగా ట్రైన్ లలో పోలీస్ వారు గంజాయి గురించి తనిఖీలు చేస్తున్నారని తెలిసింది. ఇంతలో వరంగల్ రైల్వే స్టేషన్ రాగా నేను ఇక్కడ ట్రైన్ దిగి అక్కడ ఉన్న ఆటో వారిని హైదరాబాద్ కు వెళ్ళుటకు హన్మకొండ బస్టాండుకు తీసుకుని వెళ్లగా పోలీస్ వారు పట్టుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు.





గ్రూప్ వన్ టాపర్ కన్నం హరిని నీ

## అభినందించిన ఉపాధ్యాయులు

**కరీంనగర్, మహా:** ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాలలో 55 ర్యాంక్ సాధించి డిప్టీ కలెక్టర్గా సెలెక్ట్ అయిన నగరంలోని 17వ డివిజన్ విద్యానగర్ కు చెందిన ఉపాధ్యాయులుకన్నం రమేష్, జ్యోతి దంపతుల కూతురు కన్నం హరిని నీ విద్యానగర్ కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పి ఆర్ టి యు టీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, బిజెపి నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు మానువాడ శంకర్, పి ఆర్ టి యు కరీంనగర్ పట్టణ అధ్యక్షులు దొమ్మాట కరుణాకర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు బొంగోని పరుశ రాములు డిప్యూటీ కలెక్టర్ గా సెలెక్ట్ అయిన కన్నం హరిని నీవారి తల్లిదండ్రులు జ్యోతి రమేష్ లను ఘనంగా సన్మానించారు.

## మోత్కూర్ ఇన్చార్జి ఎమ్మార్వోగా బాధ్యతలు తీసుకున్నా ఎం. ఉపేందర్

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఇన్చార్జి ఎమ్మార్వోగా ఎం. ఉపేందర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో మోత్కూరు ఎమ్మార్వోగా విధులు నిర్వహించిన రాంప్రసాద్ మార్చి 31తో పదవీకాలం ముగియడంతో, అధికారులు ఇక్కడే డిప్యూటీ తహసీల్దారుగా సంవత్సరం కాలంగా పనిచేస్తున్న ఎం. ఉపేందర్‌కు ఇన్చార్జి ఎమ్మార్వో బాధ్యతలు అప్పగించారు. ఇందువల్ల గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన ముఖ్యమైన ప్రజాసేవలు త్వరలోనే పునరుద్ధరయ్యే అవకాశం ఉంది. క్యాస్ట్ సర్టిఫికెట్లు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు సహా వివిధ సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఇది ఊరట కలిగించే విషయం. ప్రజలకు అవసరమైన సేవలు తిరిగి అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్నిరకాల సేవలను యథాస్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని ఎమ్మార్వో ఎం. ఉపేందర్ పేర్కొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, మహా:** వరంగల్ నగరం లోని చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని, ముఖ్యంగా ఎండాకాలంలో వచ్చు ఆరోగ్య సమస్యలకు వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, పాటించని వారి పైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య లక్ష్యాలను 100% పూర్తి చేయాలని సూచించారు.



# పెండింగ్ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి

- పోస్టుల భర్తీలో రిజర్వేషన్ తప్పనిసరి
- సివిల్ రైట్స్ డే ద్వారా అవగాహన కల్పించాలి
- సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తే చర్యలు
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**కరీంనగర్, మహా:** వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని, ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా అధికారులతో ల్యాండ్, ప్రభుత్వ సేవలు, అట్రాసిటీ తదితర అంశాలపై కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఈ నెల 30 లోగా పరిష్కరించాలని అన్నారు. అట్రాసిటీ కేసులు కోర్టులో నిలబడే విధంగా బలమైన సాక్ష్యాలను పోలీసులు సమర్పించి నిందితులకు శిక్షపడేలా చూడాలని కోరారు. కోర్టు స్థాయిలో పెండింగ్లో ఉన్న కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమీక్షించి త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. అట్రాసిటీ కేసుల్లో వైద్య ఆరోగ్య శాఖ నుండి పెండింగ్ లో ఉన్న అవసరమైన వైద్య నివేదికలు వెంటనే పంపాలని ఆదేశించారు. కులం సర్టిఫికెట్ సమర్పించని కారణంగా పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి వెంటనే సంబంధిత సర్టిఫికెట్ జారీ చేయాలని తహసిల్దార్లకు సూచించారు. రెవెన్యూ శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న భూమి సంబంధిత కేసులను ఈ నెల 30లోగా పరిష్కరించాలని ఆర్డీవోలను ఆదేశించారు. అంబేద్కర్ విద్యానిధి పథకం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో కులాంతర వివాహ ప్రోత్సాహకాలకు కావలసిన బడ్జెట్ వివరాలు సమర్పిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, ఆర్డీవోలు జిల్లా స్థాయి అధికారులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన బహుజన బిడ్డ దొడ్డి కొమురయ్య, సేవలు చిరస్మరణీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అన్నారు. దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా మోత్కూరులో ఆయన విగ్రహానికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, 19వ శతాబ్దంలో భూస్వాములు, పెత్తందారులు పేద ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకొని వారి ఆరాచాకాలకు పాల్పడిన తరుణంలో, పేదల పక్షాన పోరాడిన గొప్ప వ్యక్తి దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. ఆయన సేవలను కొత్త తరాలు గుర్తుంచుకోవాలని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు, నిలిగొండ మత్స్య గిరి, స్థానిక నాయకులు అన్నెపు వెంకట్, యానాల దామోదర్ రెడ్డి, గొడిశాల రమేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలి

- ఆధునిక పద్ధతులతో బోధన మార్పు తెస్తుంది
- రాష్ట్ర మంత్రి సీతక్క
- ములుగు జిల్లాలోని పలు మండలాల్లో సన్నబియ్యం పంపిణీ
- తాడ్వాయి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి






**ములుగు, మహా :** పాఠశాలల్లో విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని, ఆధునిక పద్ధతులతో విద్యాబోధన ద్వారా విద్యార్థుల భవిష్యత్ కు అనుగుణంగా మార్పు తెస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. గురువారం ములుగు జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్క ములుగు మండలం జంగాలపల్లి, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని లబ్దిదారులకు బియ్యం అందజేశారు. అదేవిధంగా తాడ్వాయి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం 15కంప్యూటర్లు కలిగిన ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వసతిగృహాలు ఇళ్లలాంటివేనని, బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కష్టపడి చదివే ప్రతీ ఒక్కరికీ ఎలాంటి వ్యాధులు సోకవన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేస్తూ శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. గత కొద్ది నెలల క్రితం పలు కంపెనీల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా విద్యాబోధన చేయడానికి అవకాశాలను మెరుగుపరచడం జరిగిందని, రానున్న రోజులలో ఆశ్రమ పాఠశాలలో సైతం కంప్యూటర్ ద్వారా నూతన పరిజ్ఞానంతో విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం సులభతరంగా ఇంగ్లీష్ నేర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ములుగు మండలం జగ్గన్నపేట, తాడువాయి మండలంలోని ఆశ్రమ కళాశాలలకు అధికారికంగా అనుమతి వచ్చిందని, చిన్నతనం నుండే కంప్యూటర్ నేర్చుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరికి ఎంత జ్ఞానం ఉన్నప్పటికీ ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం లేని పక్షంలో అంతా వృధా అవుతుందన్నారు. అదేవిధంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పేదవాడు ధనవంతులతో సమానంగా భోజనం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ పథకాన్ని వృధా చేయకుండా బియ్యం డైవర్ట్ కాకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రానున్న రోజుల్లో అన్ని పథాకాలు అమలులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుహాసిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి, కంప్యూటర్ ల్యాబ్ ఇన్చార్జి సృజన, డీసీఎస్వో డీఎం రాంపతి, తహసీల్దార్ వేణుగోపాల్, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకట నారాయణ, ఎంపీడీవోలు రామకృష్ణ, రాజ్యలక్ష్మి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్ట్ కు వాయుసేన అనుమతులు శుభపరిణామం- బాలూరి గోవర్ధన్ రెడ్డి

## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ కు భారత వాయు సేన నుండి అనుమతులు రావడం శుభపరిణామమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.1930లోనే ఇక్కడ నిజాం కాలంలో యుద్ధ విమానాలు ఇంధనం నింపు కోవడం కోసం దిగేవని తెలిపారు. 2009లో అప్పటి యంపీ జైరాంరమేష్ చొరవతో ఇక్కడ ఎయిర్ పోర్ట్ ఆశలు చిగురించాయని తెలిపారు. కాని కేసీఆర్ ప్రభుత్వం లో దీనికి ఒక్కడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఇక్కడ ఎయిర్ పోర్ట్ విషయంలో అప్పటి సీయం కేసీఆర్ మంత్రి ,ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోక ఆదిలాబాద్ తీవ్ర అన్యాయం చేసారని ఆరోపించారు. కాని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ ను దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ కు ఎయిర్ పోర్ట్ తెస్తానని ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించి కేంద్ర విమాన యాన శాఖతో సంప్రదింపులు జరిపి అనుమతులు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఇటు అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సైతం ప్రభుత్వాలకు ఇదే విషయమై లేఖల ద్వారా విన్నవించినట్టు వివరించారు. ఆదిలాబాద్ కు ఎయిర్ పోర్ట్ సాధనలో ఇది ఒక ముందడుగు గా ఆయన అభివర్ణించారు.ఇక్కడ ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే వెనుక బడిన జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ ప్రగతి రూపు రేఖలే మారుతాయన్నారు. వేల కోట్ల ప్రాజెక్టులు ఇక్కడకు వస్తాయన్నారు. తద్వారా ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక పురోగతి సాధిస్తుందన్నారు. అన్నిరంగాలలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుదన్నారు. ఈ సమావేశంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,ఐ.ఎన్.టి.యూ.సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,జాఫర్ అహ్మద్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,తిరుమని మహేందర్,సుధాకర్ గౌడ్,దొగ్గలి రాజేశ్వర్,అడ్డి రూకేష్ రెడ్డి,సాహెబ్రావు,ఎం.ఏ కయ్యూమ్,రాజా లింగన్న,శ్రీనివాస్ రెడ్డి,రాహుల్,గేడం రాస్పత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్



■ కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు.. నేతల చిత్ర పటాలకు పాలాభిషేకం

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ కు అనుమతులు రావడంతో తామంతా హర్షం వ్యక్తం చేస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. అసెంబ్లీ లో సీయం రేవంత్ రెడ్డి ప్రకటించి మరీ సాధించారని తెలిపారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మంత్రి సీతక్క చొరవతో ఈ విషయంలో లేఖల ద్వారా ఇరు ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించినట్టు వివరించారు. మొత్తానికి ఎయిర్ పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్ రావడంతో గురువారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో సీయం రేవంత్ రెడ్డి,జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క,కంది శ్రీనివాస రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమం లో డీసీసీబీ డైరక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,ఐ.ఎన్.టి.యూ.సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,జాఫర్ అహ్మద్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,తిరుమని మహేందర్,సుధాకర్ గౌడ్,దొగ్గలి రాజేశ్వర్,అడ్డి రూకేష్ రెడ్డి,సాహెబ్రావు,ఎం.ఏ కయ్యూమ్,రాజా లింగన్న,శ్రీనివాస్ రెడ్డి,రాహుల్,గేడం రాస్పత్ తదితరులు పాల్గొన్నారు.




## హెచ్సీయూ భూములను యూనివర్సిటీకే వదిలెయ్యాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీన్ మమన్
- ఛలో హెచ్సీయూకి వెళ్లకుండా ఏబీబీపీ నాయకుల ముందస్తు అరెస్టు

**ములుగు, మహా :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబందించిన 400ల ఎకరాల భూములను తిరిగి యూనివర్సిటీకే దక్కేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మేడుదుల మమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఛలో హెచ్సీయూకు వెళ్లకుండా ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మమన్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ముందస్తు అరెస్టులు దారుణమని, తెల్లవారేసరికే విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కులపై దాడిచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలన్నారు. ప్రతీ పైరునికి ప్రశ్నించే హక్కు ఉందని, అణిచివేతలతో విద్యార్థులను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రకృతిని నాశనం చేస్తూ వన్యప్రాణులను చంపేసేలా చేస్తున్న పనులను వెంటనే ఆపేయాలని, సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్వర్వులు ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. పోలీసులు అదపులోకి తీసుకున్న వారిలో మమన్ తోపాటు ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

# గోవుల గోస ..!

■ మూగ జీవాల మౌన హాహాకారాలు.. అనాథలైపోతున్న ఆవులు.. మూగ జీవాలపై కర్కశం





**ఏటూరునాగారం, మహా:** గోదావరి ఒడ్డున పసిఫలే గోధూమ మైదానాల్లో నడుచుకుంటూ వెళ్లే ఆవుల్ని చూసి ఆనందించని మనిషి లేడేమో. కాని ఇప్పుడు వాటి గతి ఏమిటి? మన గ్రామాల్లో మనవడి చేతుల్లో పాలిచ్చే గోమాత నేడు వ్యాపార దందాకు బలవుతోంది. మూగజీవాలకు న్యాయం చేయాల్సిన మనం వాటి కన్నీరు తుడవడం మర్చిపోయాం. మన పూర్వీకులు గోవులను పూజించే పద్ధతిని కొనసాగించినా, ప్రస్తుత కాలంలో వాటి గతి దారుణంగా మారింది. రోడ్ల వెంట తిరిగే ఆవులను, అన్నదాతల అండగా ఉండే ఎద్దులను అక్రమంగా తరలిస్తూ, హింసిస్తూ చంపేస్తున్న ఘోరచర్యలు మన కళ్ల ముందే నడుస్తున్నాయి. మనం భగవంతునిగా కొలిచే గోమాత ఇప్పుడు వ్యాపార లాభాల కోసం బలిపశువుగా మారుతోంది. ఈ దారుణ దృశ్యాలు మనం ఎంతకాలం చూసీ చూడనట్లు ఉంటాం? అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కుల నిర్బంధం, ప్రజల నిర్లిప్తత – ఈ మూడూ కలిసొచ్చి మన మూగ జీవాలను నాశనం చేస్తున్నాయి. వీటిని అడ్డుకోవడం మన సమాజం పట్ల మన బాధ్యత. ఇప్పటికైనా మేల్కొని ఈ అమానుష దందాను అరికట్టకపోతే, మన భవిష్యత్తు తరాలకు గోవు కేవలం పురాణ గాథల్లో మాత్రమే మిగిలిపోతుంది.

**రక్తంతో తడిసిన రవాణా మార్గాలు**

ప్రతి రాత్రి వేలాది గోవులు, ఎద్దులు, దూడలు అక్రమంగా తరలింపవుతూనే ఉన్నాయి. అవి గోడలు తాకుతూ గాయాల పాలవుతుంటాయి. త్రోవలో విరగకూడని కాళ్లు విరుగుతాయి. శరీరంపై కోతలు, నెత్తుటి మరకలు, నిస్సహాయంగా కన్నీరు పెట్టుకునే ఆ కళ్లలో వేదన చూడలేనిది. ఓ మేత మేసే ఆవు తల్లి తన దూడను చివరిసారి చూస్తున్నప్పుడు ఆ తల్లితనం నిండిన కళ్లలో కనిపించే దుఃఖాన్ని చూడగలరా? కానీ నోట కట్టిన గుండెల్లో గగ్గోలు పెడుతున్నా ఈ అక్రమ దందా నడుస్తూనే ఉంది.

**అధికారుల హస్తం – గోశాలలోకి కాకుండా బలిపీఠానికి**

పట్టుబడిన వాహనాల్లోని కొన్ని ఆవులను గోశాలలోకి తరలించేవారు. కానీ మిగతా శాతాన్ని అక్రమంగా తిరిగి ముఠాలకు అప్పగించే దారుణం నడుస్తోంది. పోలీసుల అండతో నడుస్తున్న ఈ వ్యాపారం ఎంతో మంది అధికారుల చేతుల నెమరువేసుకుంటోంది. అవి మనం పూజించే ఆవులే. **పశువుల కన్నీరు – మన హృదయాన్ని తడపజేయదా?**

పట్టుబడిన పశువులను చూస్తే అవి మనతో మాట్లాడాలనుకుంటున్నట్టుగా అనిపిస్తుంది. “నన్ను కాపాడండి! నా దూడ కోసం నేను బ్రతకాలి! మేము ఏ తప్పు చేశాం?'' అని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించదు? మనం చూస్తున్నా, వినిపిస్తున్నా కానీ స్పందించడంలేదు. మన చేతులు కట్టేసుకున్నాం.

**ప్రజల కోపం – ఇకనైనా మేల్కొనాలి**

ఈ అక్రమ దందాను మూలాల నుంచి తరిమివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసు యంత్రాంగం అక్రమార్కులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. మూగజీవాల గోసలు మనం వినకపోతే, మనలో మానవత్వం శూన్యమైపోతుంది. ఈ అక్రమ రవాణా పై ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే, మన సమాజానికి ఇది చెరగని మచ్చగా మిగిలిపోతుంది. గోవుల కన్నీరు మన గుండెల్ని తడపకపోతే, మనం ఇంకా మనుషులమేనా?

## సన్న బియ్యం పంపిణీ



**వెంకటాపురం, మహా:** సంపన్నులకు సామాన్యులకు ఒకే రకమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మొదలుపెట్టారని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల్లో గురువారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పలు శంకుస్థాపనలను నిర్వహించారు. అనంతరం సన్న బియ్యం పథకాన్ని లాంచనంగా వాజేడు, వెంకటాపురం మండలాల్లో సన్న బియ్యం పథకాన్ని ములుగు అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, జిల్లా సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరు స్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్విని చేసుకోవాలని, అర్హులైన వారికి అందే విధంగా అధికారులు చర్యలు తీసు కోవాలని కోరారు. ప్రజాపాలన, సంక్షేమం, రైతు సంక్షేమంతో, పాటు రాజీవ్ యువ వికాసం ఇంకా ఇతర పథకాలతో ప్రజా పాలన ప్రజల వద్దకు చేరువ అయ్యేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం వెంకటాపురంలో 28 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి, ప్రజల నుండి అనేక సమ స్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చిడెం మోహన్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంబాబు తో పాటు మండల తాసిల్దార్ లక్ష్మీరాజయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేంద్ర ప్రసాద్, మండల పంచాయతీ అధికారి హనుమంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిడెం సాంబశివరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ రాములు రమేష్, మాజీ ఎంపిటిసిలు రవి, సీతాదేవి నాయకు లు పిల్లారి శెట్టి మురళి, లతోపాటు పలువురు నాయ కులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతికి కొత్త ఒరవడి

- భద్రాచలం ట్రైబల్ మ్యూజియం
- ఆచారాల అద్దం.. ఆదివాసీ సంపదకు వెలుగులు
- మట్టిని ముద్దాడే సంస్కృతి .. కొత్త తరం కోసం మహత్తర ప్రదర్శన
- శ్రీరామ నవమి నాడు ప్రారంభం



**భద్రాచలం, మహా:** ఆడవిలో ముడిపడి జీవించేది వాళ్లే, ప్రకృతిని గుండెలలో పెట్టుకుని నడిచి పోతూ, సాంప్రదాయాన్ని శ్వాసగా మలచుకున్నవాళ్లు గిరిజనులు. కాలంతో పోరాడుతూ, జీవన పోరాటాన్ని సాగిస్తూ, తమ సంస్కృతి మూలాలను కాపాడుకునే మహనీయులు. అయితే ఈ ఆధునిక ప్రపంచంలో వారి జీవితానికి అర్థం మారిపోతోంది. మనిషి అభివృద్ధి పేరుతో అడవులను తొలగించేసినప్పుడు, వాళ్ల జాడలు కూడా కనుమరుగైపోతున్నాయి. వారి గొప్పతనాన్ని భద్రపరిచే ప్రయత్నంగా భద్రాచలం ట్రైబల్ మ్యూజియం వెలుగులు సృష్టిస్తోంది. ఇది కేవలం చూడటానికి ఉండే ప్రదేశం కాదు.. ఇది గతాన్ని చూస్తూ భవిష్యత్ తరాలకు వారసత్వాన్ని అందించే అద్భుత ప్రయత్నం. గిరిజనుల జీవన గాథలు, వారి పోరాటాలు, ఆనందాలు, కష్టాలు——ఇది ఒక నిశ్చలమైన గీతిక. శ్రీరామ నవమి రోజున ఈ మ్యూజియం గిరిజన సమాజానికి ఒక గౌరవ ప్రతిమగా నిలువనుంది.

**గిరిజన జీవన విధానానికి అద్దం – భద్రాచలం ట్రైబల్ మ్యూజియం**

ఒకనాటి దట్టమైన అడవుల్లో, గడ్డి గూళ్లలో ఉండే ఆదివాసీ కుటుంబాలు, పిడికెడు గింజలతో జీవించే వారు. నేటి మారిన సమాజంలో వారు తమ సొంత గడ్డపైనే పరాయి అయ్యారు. అలాంటి గిరిజనుల జీవన విధానాన్ని, వారి మట్టిమనం మళ్ళీ తెలియజేసే ప్రయత్నంగా భద్రాచలం ట్రైబల్ మ్యూజియం తీర్చిదిద్దబడింది. ఇది ఆదివాసీల ఆచారాలను, సంస్కృతిని, కుటుంబ వ్యవస్థను, తినే తిండి, ధారించే బట్టలు, చేసుకునే పండుగలను సజీవంగా చూపించేది.

ప్రత్యేక ఆకర్షణలు – మనసును కదిలించే ప్రదర్శనలు

- **లైఫ్ స్టైల్ రూమ్ – గిరిజనుల ప్రతిరోజు జీవితం**
- **ఆర్నమెంట్ రూమ్ – గిరిజన ఆభరణాల కళతెన్నెలు**
- **ఫెస్టివల్ రూమ్ – ట్రైబల్ పండుగల అద్భుత దృశ్యాలు**
- **హంటింగ్ రూమ్ – వేటకు ఉపయోగించే ఆయుధ సంపద**
- **తరతరాలకు ఆదర్శం – టూరిస్టులకు కొత్త అనుభూతి**

ఇక్కడ కేవలం చూసే ప్రదర్శనలు మాత్రమే కాదు, అనుభవించాల్సిన జీవితం ఉంది. గిరిజన సంప్రదాయ మట్టి ఇళ్లు, వారి వంట విధానం, సాంప్రదాయ సంగీతం – ప్రతి అనుభూతి వీక్షకులను అలరిస్తుంది.

**వినోదం – ప్రకృతిని హత్తుకునే అనుభూతి**

యాత్రికుల కోసం బోటింగ్, బీచ్ వాలీబాల్, బాక్స్ క్రికెట్, బ్యాడ్మింటన్, ఆర్చరీ వంటి ఆటల వేదికలు ఏర్పాటు చేశారు. గిరిజనుల సాంప్రదాయ వంటకాలు కూడా టూరిస్టులకు అందుబాటులో ఉంటాయి. వనభోజనం అనుభవాన్ని తలపించేలా ప్రత్యేక వంటశాల ఏర్పాటైంది.

**గిరిజన పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం**

భద్రాచలం ట్రైబల్ మ్యూజియం కేవలం ఓ ప్రదర్శన కాదు, ఓ ఉద్యమం. గిరిజనుల గొప్పతనాన్ని, వారి పోరాటాన్ని, సమాజానికి తెలియజేసే బలమైన వేదిక. శ్రీరామ నవమి రోజున ప్రారంభమవుతోన్న ఈ మ్యూజియం, గిరిజనులకు గౌరవ ప్రతిమ, మనకు స్ఫూర్తి, భవిష్యత్ తరాలకు వెలుగు. ఇది గతాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ, సంస్కృతి నిలబెట్టే మహత్తర సంకల్పం.

## దోపిడీకి పాల్పడిన వ్యక్తుల పై కేసు నమోదు

**వరంగల్, మహా:** వరంగల్ నగరంలో తేదీ: 3.04.2025 అర్ధరాత్రి సుమారు 12.45 am కు ఎండి జాకీర్, తండ్రి పేరు: అహ్మద్ ఎల్బీనగర్, వరంగల్ యొక్క రెండు లారీలు TS 01 UB 1641.. AP 20 TA 4299 గలవి వాటిలో ఎనుమాముల మార్కెట్లో మక్క లను లోడ్ చేసుకొని మసాయిపేట లో అన్లోడ్ చేయడా నికి బయలుదేరి వెళ్తూ ఉండగా దేశాయ్ పేట రోడ్ లోని సూర్య బార్ వద్దకు చేరుకునే సరికి ముగ్గురు గుర్తుతెలి యని వ్యక్తులు ఆ రెండు లారీలను అడ్డగించి లారీల డ్రైవర్లు మునావర్, బషీర్ తో పాటు క్లీనర్ లుగా షబ్బీర్ ఫిర్యాది లు ఉండి వారు లారీ లలో నుండి క్రిందకి దిగి వారిని పక్కకు జరిపే ప్రయత్నంలో అట్టి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఆ డ్రైవర్లను, క్లీనర్ లను బెదిరించి, చేతులతో కొట్టి, భయపెట్టి దౌర్జన్యంగా వారి వద్ద ఉన్న 3000/రూపాయలను లాక్కొని వెళ్ళినారని వారు ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఇంతె జార్గంజ్ ఇన్స్పెక్టర్ ఎంఏ షుకూర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# సన్న బియ్యం పథకం పేదలకు ఓ వరం

## కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేయర్ కలెక్టర్




**వరంగల్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని గురువారం వరంగల్ జిల్లా జిడబ్ల్యూఎంసీ పరిధిలో 15 వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో స్థానిక శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సన్న బియ్యం పథకం పేదలకు ఓ వరమని ఈ పథకాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్య రాణి, ఆర్ డి ఓ సత్య పాల్ రెడ్డి, కార్పొరేటర్ ఆకుల మనోహర్, డి ఎస్ డి ఓ కిష్టయ్య, తహసీల్దార్ రియాజ్, తదితరులు, పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా దొడ్డు కొమరయ్య జయంతి వేడుకలు



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డు కొమరయ్య జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జనగామ జిల్లాలో కడవెండి గ్రామంలో 1927 ,ఏప్రిల్ 3 న జన్మించి 19 సంవత్సరాల లోనే అమరుడై తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడుగా, తొలి అమరవీరుడిగా పేరొందిన మహానియుడని కొనియాడారు. జనగామ జిల్లాలో పోరాటయోధులు జన్మించారని వారు ఏ కుటుంబంలో పుట్టారన్నదాని కంటే ఏలాంటి మార్పు తీసుకువచ్చారన్నదే ముఖ్యమని, వారిని మనమందరం గుర్తు చేసుకోని వారి అడుగు జాడల్లో నడవాలని అన్నారు. మహనీయుని జీవిత చరిత్రను భవిష్యత్తు తరతరాలకు తెలియజేయడం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషమని జిల్లా కలెక్టర్ అన్నారు. కుల సంఘాలకు నిరుద్యోగ యువతి యువకులకు రాష్ట్ర ప్రభుత్వం, రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, దరఖాస్తు చేసుకొనుటకు గడువు ఏప్రిల్ 14 వరకు పొడిగించినందున అర్హత కలిగిన నిరుద్యోగులు మాన్యువల్ గా కానీ ఆన్లైన్ లో మండల ఎంపిడిఓ ఆఫీస్ లో, వరంగల్ అర్బన్ పరిధిలో జి డబ్ల్యూ ఎం సి లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, సంబంధిత అధికారులు కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డుల ఏర్పాటుచేయాలి




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నిర్మించిన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు మరియు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, బి ఆర్ ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు, జంగ శ్రీను, డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మచ్చ గిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగ శ్రీను మాట్లాడుతూ, పట్టణంలో రహదారి విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కొత్త రహదారులు నిర్మించారని, అయితే వీటిపై స్పీడ్ బ్రేకర్లు మరియు సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి, పాత బస్టాండ్, చెరువు కట్ట, ఎస్బిఐ సమీపంలో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు మరియు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## పదవీవిరమణ పొందిన పోలీసులకు సన్మానం



**హన్మకొండ, మహా:** వరంగల్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులు ఏ.ఎస్. ఐ లు జనార్ధన్, ప్రేమలతలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీసేవలను నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని పదవీ విరమణ తర్వాత కూడా మీ గౌరవం తగ్గదని, ఆరోగ్యం శ్రద్ధ వహించాలని నిత్యం వ్యాయామం కొరకు కొద్ది సమయాన్ని కేటాయించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏ ఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ రమాదేవి ఆర్.ఐ సతీష్, పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అరుదైన శస్త్ర చికిత్స




**హుజూర్ నగర్,మహా:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన సరోజన(42) అనే మహిళ గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ హుజూర్ నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ ఎదురుగా ఉన్న విష్ణు జనరల్ ల్యాప్రోస్కోపిక్ హాస్పటల్ కు బుధవారం చికిత్స నిమితం చేరింది. ఆమెకు డాక్టర్ అనంతు విష్ణువర్ధన్ గౌడ్ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేయగా అండాశయం వద్ద 7 కిలోల కణితి ఉన్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలో సదరు మహిళకు హస్పటల్ లో అరుదైన శస్త్ర చికిత్స చేసి అండాశయం వద్ద ఉన్న 7 కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య స్థితి బాగానే ఉన్నట్లుగా డాక్టర్ అనంతు విష్ణువర్ధన్ గౌడ్ తెలిపారు.

## ఎనుమాముల మార్కెట్ ను సందర్శించిన కలెక్టర్



**వరంగల్, మహా:** వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డ్ ఆధ్వర్యంలోని మిరప మార్కెట్ యార్డ్ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి మిరప లావాదేవీలను పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా మిరప సాగు విస్తీర్ణం, దిగుబడి, వివిధ రకాల మిర్చి ధరల గురించి రైతులతో సంభాషించారు. మిరప ను శుభ్రపరచడం, ఎండబెట్టడం, గ్రేడింగ్ చేయడం వలన నాణ్యతను మెరుగుపరుస్తుందని మంచి ధరను పొందగలుగుతారని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితి ధరల ధోరణి గురించి వ్యాపారులతో మాట్లాడి వారి మాటల్లో తెలుసుకోవడం జరిగింది. హరే రామ..హరే కృష్ణ కింద మిరప యార్డ్ ప్రాంగణంలో రూ. 5/ సబ్సిడీ భోజన అందించే కేంద్రాన్ని సందర్శించారు. ఎనుమాముల మార్కెట్ యార్డులో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయుటకు స్థలం పరిశీలించి ఏర్పాటుకు మెగ్మా పీడీ రేణుకను ఆదేశించారు. వియిమెంట్ ఇంటిగ్రేషన్ ద్వారా అయ్యే కాంటాలని పరిశీలించడం తో పాటు మార్కెట్ యార్డ్లో మొబైల్ టాయిలెట్ లను అందించడానికి ప్రతిపాదనలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో వరంగల్ డిఎంఓ సురేఖ, సెక్రటరీ జి రెడ్డి, హార్టికల్చర్ అధికారి సంగీతలక్ష్మి, మెగ్మా పిడి రేణుకా, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వడ్డీ రేట్లను సవరించిన ప్రముఖ బ్యాంక్

### రెపో ఆధారిత రుణాలపై 0.10 శాతం పెంపు

**న్యూఢిల్లీ:** రెపో ఆధారిత రుణాల రేట్లను 0.10 శాతం మేర పెంచుతున్నట్టు ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. రెపో రేటును ఆర్‌బీఐ ఇటీవలే పావు శాతం తగ్గించినప్పటికీ ప్రభుత్వరంగ ఇండియన్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), ట్రెజరీ బిల్లుల ఆధారిత రుణ రేటు (టీబీఎల్ఆర్), బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్), రెపో లింక్డ్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ (ఆర్‌బీఎల్ఆర్)పై బ్యాంక్ అస్సెట్ లయబిలిటీ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలను ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. రెపో లింక్డ్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (రెపో ఆధారితం/ఆర్‌బీఎల్ఆర్)ను 0.10 శాతం పెంచడంతో 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరింది. 6 నెలల నుంచి మూడేళ్లలో కాలం తీరిపోయే రుణాలకు అమలు చేసే టీబీఎల్ఆర్ రేటును 0.05 శాతం తగ్గించడంతో 6.5 శాతానికి దిగొచ్చింది. బేస్ రేటును సైతం 0.05 శాతం తగ్గించగా, 9.80 శాతానికి చేరింది. సవరించిన రేట్లు ఏప్రిల్ 3 నుంచి అమల్లోకి వస్తాయని ఇండియన్ బ్యాంక్ వెల్లడించింది.

## నష్టాలతో ముగిసిన మార్కెట్లు.. ఐటీ షేర్లు పతనం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై సుంకాలను ప్రకటించడంతో ఇండియన్ బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ అన్ని యూఎస్ దిగుమతులపై బేస్‌లైన్ 10 శాతం పన్నును కలిగి ఉన్న కొత్త టారిఫ్ నిర్మాణాన్ని ప్రవేశపెట్టారు. వాణిజ్య మిగులు ఉన్న దేశాలపై అదనపు అధిక సుంకాలను విధించించారు. భారత్ ఇప్పుడు అమెరికా నుంచి 27 శాతం సుంకాన్ని ఎదుర్కొంటోంది. ఈరోజు బీఎస్ఈ సెన్సెక్స్ 322.08 పాయింట్లు (0.42 శాతం) క్షీణించి 76,295.36 వద్ద స్థిరపడింది. ఈ రోజు సూచీ 76,493.74 75,807.55 రేంజ్‌లో ట్రేడ్ అయింది. నిఫ్టీ 50 కూడా 82.25 పాయింట్లు లేదా 0.35 శాతం క్షీణించి 23,250.10 వద్ద స్థిరపడింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్ షేర్లు నష్టాల్లో ముగియడంతో బీఎస్ఈ సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 నష్టాల్లో ముగిశాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, సన్ ఫార్మా, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్ 4.57 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం పెరగడంతో స్మాల్ క్యాప్ షేర్లు విస్తృత మార్కెట్లను మించిపోయాయి. రంగాలవారీ సూచీల్లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.21 శాతం నష్టపోగా, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, కోఫోర్జ్, టీసీఎస్, ఎంఫాసిస్ సూచీలు నష్టపోయాయి. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ రంగాలు కూడా తక్కువ పనితీరు కనబరిచాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2.25 శాతానికి పైగా లాభపడటంతో ఫార్మా షేర్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, హెల్త్ కేర్, ఎఫ్ ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.94 శాతం వరకు లాభపడ్డాయి.

## ట్రంప్ సుంకాల మోత, సోషల్ మీడియాలో మీమ్స్ హోరు మాములుగా లేదు!





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాదాపు అన్ని దేశాలపై నా టారిఫ్స్ కొరడా ఝుళిపించాడు. దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై "రెసిప్రోకల్ టారిఫ్స్" విధించడం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10శాతం పన్నులు చెల్లించాల్సింది ఉంటుందని ప్రకటించారు. భారత్ నుంచి దిగుమతి వస్తువులపై 26శాతం, చైనా నుండి వచ్చే వస్తువులపై 34 శాతం పన్ను విధించారు. దీంతో చైనా మొత్తం పన్నుల శాతం 54 శాతానికి చేరింది. ఇక సౌత్ కొరియాపై 25 శాతం యూరోపియన్ యూనియన్ నుండి వచ్చే వస్తువులపై 20 శాతం పన్ను విధించారు. యూకే వచ్చే వస్తువులపై 10 శాతం పన్ను విధించారు. ట్రంప్ తాజా ప్రకటనపై పలు దేశాధినేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు కూడా. మరోవైపు ట్రంప్ వడ్డింపులపై సోషల్‌మీడియాలో మీమ్స్ వెల్లువెత్తాయి.

అమెరికా ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, వృద్ధికోసం దాని మిత్రదేశాలు సహా దాదాపు అన్నిదేశాలపై ప్రతీకార సుంకాలను విధించారు ట్రంప్. ఎవరూ ఆపలేని ఆర్థిక యుద్ధం జరుగుతోందంటూ జాతీయ ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించి, సుంకాలను ప్రకటించిన వెంటనే #TrumpTariffs , #TradeWar ఎక్స్( X)లో ట్రెండింగ్ షురూ అయింది. "విముక్తి దినోత్సవ శుభాకాంక్షలు! మన డబ్బు నుండి మనం విముక్తి పొందేలా చేసినందుకు ట్రంప్ ధన్యవాదాలు. ఇకనాకు బువ్వ ఉండదు. అమెరికా గ్రేట్ ఎగైన్ అంటే మనల్ని తిరిగి మహా మాంద్యంలోకి తీసుకెళ్లడం అని అనుకున్నాడనుకుంట'' అని ఒకరు ట్వీట్ చేశారు. జపాన్ ఎగుమతులపై 24 శాతం సుంకాలు విధించినందుకు ట్రంప్‌ను విమర్శిస్తూ," సరైన మనస్సు గల జపనీస్ వ్యక్తి అమెరికన్ కారును ఎందుకు కొనుగోలు చేయాలి?" అని ప్రశ్నించారు. అంతేకాదు ఈ సుంకాల నుండి రష్యాను మినహాయించినందుకు నెటిజన్లు ట్రంప్‌ను కూడా ఎగతాళి చేశారు. "ట్రంప్ రష్యాపై విధించిన సుంకాలు లేదా ఆర్థిక చర్యలు లేవు. నాకు ఎందుకు ఆశ్చర్యంగా ఉంది" అంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నవ్వుతూ ఉన్న జిఫ్‌ను ట్విట్ చేశాడు. "ట్రంప్‌స్టర్స్ శుభవార్త! మీ కిరాణా సామాగ్రికి ఎంత మిగులుతుందో గుర్తించడం కష్టం.. ఎందుకంటే మిగతాటికి ఖర్చులు మరింత భారం అవుతాయి కనుక'' అంటూ మరొక యూజర్ ట్రంప్ సుంకాలపై విమర్శనాస్త్రాలు సంధించారు.


## పీపీఎఫ్ నామినీ మార్పునకు ఛార్జీలు లేవు

### నిర్మలా సీతారామన్




నామినీ వివరాలను అప్డేట్ చేసినప్పుడు లేదా మార్చినప్పుడు 'పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్' (PPF) చందాదారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి 'నిర్మలా సీతారామన్' తెలిపారు. ఈ విషయాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. పీపీఎఫ్ ఖాతాలకు నామినీ పేర్లను మార్చడానికి ఆర్థిక సంస్థలు రూ.50 వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ చార్జీలను తొలగించడానికే జీవో తీసుకురావడం జరిగింది. దీనికోసం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అవసరమైన మార్పులు చేసినట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇటీవల ఆమోదం పొందిన బ్యాంకింగ్ సవరణ బిల్లు 2025 ప్రకారం.. డిపాజిటర్ల డబ్బు, సురక్షిత కస్టడీలో ఉంచిన వస్తువులు, భద్రతా లాకర్ల చెల్లింపు కోసం నలుగురు వరకు నామినీలు ఉండవచ్చు. నామినేషన్ కోసం ఫారం 10 ని దాఖలు చేయడం ద్వారా మీరు మీ పీపీఎఫ్ ఖాతాలోని నామినీ వివరాలను మార్చవచ్చు. దీన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ అప్డేట్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి కొన్ని బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చందాదారులు వివరాలను నవీకరించడానికి అనుమతిస్తాయి.

## ఎగుమతులకు టారిఫ్‌ల గండం



**న్యూఢిల్లీ:** అమెరికా ప్రతీకార టారిఫ్‌ల ప్రతిపాదనలతో చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ఎగుమతులకు ప్రతికూలంగా ఉంటుందని ఎగుమతిదారుల్లో ఆందోళన నెలకొంది. దీని వల్ల స్వల్పకాలికంగా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. 10 శాతం వరకు సుంకాలు ఫర్వాలేదని, అంతకు మించితే మాత్రం ఇబ్బందేనని ఆయన పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు డిమాండ్‌పై టారిఫ్‌ల ప్రభావం కచ్చితంగా ఉంటుందన్నారు. దిగుమతి సుంకాలపై అనిశ్చితి వల్ల ఇప్పటికే కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లివ్వకుండా తాత్కాలికంగా ఆపి ఉంచారని రాల్హన్ చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిస్థితిని సరిదిద్దాలని, టారిఫ్‌ల సమస్యను ఎదుర్కొనడంలో ఎగుమతిదార్లకు మద్దతుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## పచ్చదనం.. పర్యావరణ సమతుల్యతే లక్ష్యం

### వివిధ ప్రాజెక్టుల కోసం ముంబైలో వేలాది చెట్ల నరికివేత

తరుగుతున్న పచ్చదనం...పెరుగుతున్న వాయుకాలుష్యం

దీన్ని చక్కదిద్దేందుకు ఎంఎంసీ పార్కుల విభాగం కృషి

'మియావాకీ' విధానంలో పార్కుల్లో మొక్కల పెంపకం



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పార్కుల విభాగం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. మియావాకీ విధానాన్ని అనుసరిస్తూ మొక్కల పెంపకాన్ని చేపడుతోంది. ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ డిపార్ట్‌మెంట్ కార్యాలయ సిబ్బంది ఇటీవల పోవై ప్రాంతంలోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పార్క్‌లో 2,000 మొక్కలను నాటారు. పార్క్ సూపరింటెండెంట్ జితేంద్ర పరదేశి, డిప్యూటీ సూపరింటెండెంట్ సాహెబ్రావ్ గవిట్, ఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ అధికారి రిషికేశ్ హెంద్రే నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబై నగరంలో నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ప్రాజెక్టుల కోసం వేలాది చెట్లను నరికివేయడం వల్ల వాయుకాలుష్యం గణనీయంగా పెరుగుతోంది. దీనిని నివారించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ నడుంబిగించింది. నరికివేసిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలను నాటేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకు మియావాకీ పద్ధతిని కూడా అనుసరించాలని నిర్ణయించింది. ముంబై నగరానికి మరింత పచ్చదనాన్ని తీసుకురావడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు సహాయపతుతుందని నగరవాసులు కూడా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు.

## మీరెళ్లి చైనీయులతో కలిసి చైనా సూప్ తాగండి

### మీరెళ్లి చైనీయులతో కలిసి చైనా సూప్ తాగండి.. రాహుల్‌పై ఠాకూర్ సెటైర్లు



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. 4వేల స్క్వేర్ కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించింది. మన భూమిని మనం తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా కేంద్రం ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ దిగువ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'భారత్ భూభాగంలో ఏం జరుగుతోంది నాకు అర్థం కావడం లేదు. చైనా భారత్ భూభాగాన్ని ఆక్రమించింది. మన భూమి మనకు వచ్చేలా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీలు .. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు లేఖ రాయాలి. చైనా 4వేల స్క్వేర్ కిలోమీటర్ల భారత భూమిని ఆక్రమించుకుంది. ఈ విషయం నన్ను మరింత షాక్‌కు గురిచేసింది. మన భూమిని మనం ఎలా తిరిగి స్వాధీనం చేసుకోవాలి? అని ఆలోచించాల్సి ఉంది. అలా చేయడం లేదు. భారత విదేశాంగ కార్యదర్శి చైనా రాయబారితో కలిసి కేక్ కట్ చేస్తున్నారు. చైనా ఆక్రమించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలి. చైనాను నియంత్రించేందుకు తీసుకున్న చర్యలపై కేంద్రం సభలో ప్రకటన చేయాలి. భారత్‌పై అమెరికా 26శాతం సుంకాలు విధించింది. దీనిపై కేంద్రం సమాధానం చెప్పాలి' అని అన్నారు. అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఘాటుగా స్పందించారు. రాహుల్‌పై పరోక్షంగా సెటైర్లు వేశారు. ఎవరి కాలంలో ఈ ప్రాంతాన్ని చైనా తన ఆధీనంలోకి తీసుకుంది? డోక్లాం ప్రతిష్టంభన సమయంలో చైనా అధికారులతో సూప్ తాగిన వ్యక్తులు ఎవరు? రాజీవ్ గాంధీ ఫౌండేషన్ చైనీయుల నుండి డబ్బు ఎందుకు తీసుకుంది?' అని అడిగారు. అలాంటి వారికి నేను ఒక్కటే చెబుతున్నా.. భారత్ భూభాగాన్ని చైనా ఒక్క అంగుళం కూడా తీసుకోలేదు. ఈ తరహా రాజకీయాలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని రాహుల్‌కు హితవు పలికారు.

## ఏం పర్లేదు! తూచ్.. నేనేం పడిపోలేదు


### వైరల్ వీడియోపై ఆస్ట్రేలియా ప్రధాని

పబ్లిక్ ఈవెంట్లకు హాజరైనప్పుడు రాజకీయ నేతలు, సెలబ్రిటీలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. మనస్ఫూర్తిగా మనుషుల్లోకి వెళ్లడం కంటే.. పబ్లిసిటీ కోసం ఫొటోలకు, వీడియోలకు ఫోజులు ఇచ్చేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. ఆనక.. శానిటైజర్లతో చేతులు తుడుచుకుంటూ కనిపించిన దాఖలాలు మన తెలుగు రాజకీయాల్లోనే చూశాం. ఆ సంగతి పక్కన పెడితే, పాపం.. ఫొటోషూట్ హడావిడిలో ఏకంగా ప్రధాని స్థాయి వ్యక్తికే ఇక్కడ చేదు అనుభవం ఎదురైంది.



**కాన్‌బెర్రా:** గురువారం న్యూ సౌత్‌వేల్స్ జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ పాల్గొన్నారు. ప్రసంగం పూర్తయ్యాక.. వేదికపై ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. ఆపై ఒక్కసారిగా పక్కకు వెళ్లి పడిపోయారు. వెంటనే లేచి తాను క్షేమంగా ఉన్నానని నవ్వుతూ సంకేతమిచ్చారు. ఆపై ఓ రేడియో ఇంటర్వ్యూకి హాజరైన ఆయన ఆ ఘటనపై స్పందించారు. నేనేం పడిపోలేదు. ఓ అడుగు వెనక్కి పడిందంతే. ఒక కాలు కిందకు వంగిపోయింది.. అంటూ నవ్వుతూ చెప్పారు. ఇదిలా ఉంటే మే 3వ తేదీన ఆస్ట్రేలియా ఎన్నికలు జరగనున్నాయి.అధికార లేబర్ పార్టీకి, పీటర్ డుట్టాన్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ లిబరల్ నేషనల్ పార్టీకి విజయావకాశాలు సమానంగా కనిపిస్తున్నాయి.

## ఓలా, ఉబర్, ర్యాపిడో సేవలు నిషేధించిన కర్ణాటక హైకోర్టు: డెడ్‌లైన్ ఫిక్స్




ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత బైక్ టాక్సీ సేవలను నిలిపివేయాలని కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. రాబోయే ఆరు వారాల్లో రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌లు తమ కార్యకలాపాలను నిలిపివేయాలని వెల్లడించింది. అయితే బైక్ ట్యాక్సీ సేవలను 1988 మోటార్ వెహికల్స్ యాక్ట్ కిందకు చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల సమయం ఇచ్చింది. రైడ్‌హెయిలింగ్ సేవల ఆపరేటర్లు.. ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించకపోవడం మాత్రమే కాకుండా, మోటార్ వాహన చట్టాలను కూడా ఉల్లంఘించారు. కొందరు బైక్ ట్యాక్సీ డ్రైవర్లు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. మోటార్ వాహన చట్టం 1988లోని సెక్షన్ 93ని అనుసరించి.. కొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకూ, ఈ నిషేధం అమలులో ఉంటుంది. అప్పటి వరకు ఓలా, ఉబర్, ర్యాపిడో బైక్ సర్వీసులు రోడ్డుపై తిరగడానికి అనుమతి లేదు. వైట్ నెంబర్ ప్లేట్ కలిగిన టూ వీలర్స్ కమర్షియల్ వినియోగానికి అనుమతి లేదు. కాబట్టి బైక్ ట్యాక్సీలు చట్ట విరుద్ధం. అయితే దీనికి సరైన చట్టబద్ధత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. మోటార్ వాహన చట్టం 1988లోని సెక్షన్ 93ని అనుసరించి.. కొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకూ, ఈ నిషేధం అమలులో ఉంటుంది. అప్పటి వరకు ఓలా, ఉబర్, ర్యాపిడో బైక్ సర్వీసులు రోడ్డుపై తిరగడానికి అనుమతి లేదు. వైట్ నెంబర్ ప్లేట్ కలిగిన టూ వీలర్స్ కమర్షియల్ వినియోగానికి అనుమతి లేదు. కాబట్టి బైక్ ట్యాక్సీలు చట్ట విరుద్ధం. అయితే దీనికి సరైన చట్టబద్ధత అవసరమని కోర్టు స్పష్టం చేసింది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 04-04-2025
ANN తెలుగు




## చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్న స్టార్ హీరోయిన్ కూతురు

సాధారణంగా సినీ కుటుంబాలకు చెందిన వారసులు చిత్ర పరిశ్రమంలోనే పనిచేయాలని కోరుకుంటుంటారు. ముందు వేరే వృత్తులకు సంబంధించిన చదువులను అభ్యసించినప్పటికీ చివరికి వారి పయనం మాత్రం సినిమానే అవుతుంది. అందుకు పలు ఉదాహరణలు ఉన్నాయి. కాగా కోలీవుడ్‌లో ప్రముఖ సినిమా జంటల్లో దర్శకుడు సుందర్ సి, నటి, నిర్మాత కుష్బూల జంట ఒకటి. వృత్తిపరంగా విజయ పథంలో దూసుకుపోతున్న ఈ జంట 2000 సంవత్సరంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ ముచ్చటైన జంటకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు అందమైన కూతుర్లు ఉన్నారు. వీరి పేరుతోనే అవ్నీ సినీ మ్యాక్ అనే చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి చిత్రాలను నిర్మిస్తున్నారు. కాగా విత్తనం ఒకటైతే మొక్క మరొకటి అవుతుందా? అనే సామెత మాదరి దర్శకుడు సుందర్ సి, నటి కుష్బూ వారసులు కూడా వారి బాటలోనే నడుస్తారనిపిస్తోంది. ఎందుకంటే సుందర్ సి, కుష్బూ దంపతుల కుమార్తెలు అవంతిక, ఆనందిత ఇప్పుడు చదువులు పూర్తి చేసుకున్నారు. వీరిలో అవంతిక అచ్చు తన తల్లి కుష్బూ రూపురేఖలనే కలిగి ఉండడంలో అతిశయోక్తి కాదు.. అవంతికను చూస్తుంటే చిన్ననాటి కుష్బూనే స్మరణకు వస్తారు. అవంతిక తాజాగా ప్రత్యేకంగా ఫొటోషూట్‌లో పాల్గొంది. ఎంతో గ్లామర్‌గా ఉన్న ఆ ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. అవి ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. తెరపైకి కుష్బూ వారసురాలు రెడీ అంటూ కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి. తండ్రి ప్రముఖ దర్శకుడు. తల్లి సంచలన నటి, నిర్మాత. వారికి తోడు సమ్మోహన రూపంతో కనిపించే అవంతికకు కథానాయకి కావడానికి ఇంతకంటే మరేం కావాలి. హీరోయిన్‌గా ఈ క్యూట్ గర్ల్ ఎంట్రీ త్వరలోనే ఉంటుందని భావిస్తున్నారు.


## ప్రముఖ రాజకీయ నాయకురాలితో పెళ్లి.. ప్రదీప్ సమాధానం ఇదే!

బుల్లితెరపై యాంకర్‌గా క్రేజ్ దక్కించుకున్న టాలీవుడ్ నటుడు ప్రదీప్ మాచిరాజు. పలు రియాలిటీ షోలకు యాంకర్‌గా పనిచేశారు. అలా యాంకరింగ్‌తో ఫేమస్ అయిన ప్రదీప్ పలు సినిమాల్లోనూ ప్రత్యేక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం ఆయనే హీరోగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి మూవీతో ఆడియన్స్‌ను పలకరించనున్నారు. ఈ సినిమకు నితిన్ భరత్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు ప్రదీప్. ఇటీవలే ట్రైలర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. తన మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ప్రదీప్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. త్వరలోనే ఓ రాజకీయ నాయకురాలితో మీ పెళ్లి జరగనుందని వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. సమయం వచ్చినప్పుడు తప్పుకుండా పెళ్లి అయితే చేసుకుంటానని అన్నారు. తన పెళ్లి గురించి ప్రదీప్ మాట్లాడుతూ.. 'నా పెళ్లికి సంబంధించి ఎలాంటి ప్లాన్ లేదు. ముందు జీవితంలో సెటిల్ కావాలనుకున్నా. నాకు సొంతంగా కొన్ని డ్రీమ్స్ ఉన్నాయి. ముందు వాటిని సాధించడమే నా లక్ష్యం. అవీ ఆలస్యం కావడంతోనే మిగిలిన పనులు కూడా వాయిదా పడుతున్నాయి. అన్నీ కూడా సరైన టైమ్‌కే పూర్తి అవుతాయని నమ్ముతున్నా. రాజకీయ నాయకురాలితో తన పెళ్లి అని వస్తున్న వార్తలు నేనూ విన్నా.. అంతకుముందే రియల్ ఎస్టేట్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెళ్లి అన్నారు.. త్వరలో క్రికెటర్‌తో పెళ్లి అంటారేమో. అన్నీ సరదా కోసమే చేస్తున్న ప్రచారం' అంటూ నవ్వుతూ మాట్లాడారు. కాగా.. ప్రదీప్ మాచిరాజు హీరోగా నటించిన చిత్రం అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి ఏప్రిల్ 11న విడుదల కానుంది.



## ట్రైలర్‌లో ఎక్కువగా బూతులు

### అందుకే వాడాల్సి వచ్చింది: సిద్ధు జొన్నలగడ్డ




డీజే టిల్లుతో ఒక్కసారిగా స్టార్‌గా మారిన టాలీవుడ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ. గతేడాది టిల్లు స్క్వేర్‌తో మరో అభిమానులను మెప్పించిన సిద్ధు సినిమాతో అలరించేందుకు రెడీ అయిపోయాడు. సిద్ధు బొమ్మరిల్లు భాస్కర్ కాంబోలో వస్తోన్న సరికొత్త యాక్షన్ మూవీ జాక్. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో హీరో సిద్ధు మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అయితే జాక్ ట్రైలర్‌లో ఎక్కువగా బూతు పదాలు ఉపయోగించడంపై సిద్ధును ప్రశ్నించారు. అవును.. బూతులు వాడాం.. కానీ అక్కడ సీన్‌కు తగినట్లుగానే పెట్టాల్సి వచ్చిందని సిద్ధు అన్నారు. ఈ విషయంలో హీరో క్యారెక్టర్‌కు.. ఆ సమయంలో ఎమోషన్‌కి ఆ డైలాగ్స్ పెట్టామని తెలిపారు. పీక్ క్లైమాక్స్ కావడంతో ఆ ఎమోషన్‌కు అది కరెక్ట్ అని అలా చేసినట్లు సిద్ధు వెల్లడించారు. అలాగే మీ మూవీ సెన్సార్ పూర్తయిందా? అని ప్రశ్నించగా.. ఆ విషయం తనకు ఇంకా తెలియదని బదులిచ్చారు. కాగా.. ఈ చిత్రంలో సిద్ధు సరసన బేబీ ఫేమ్ వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించింది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 10న థియేటర్లలో సందడి చేయనుంది.

## విడాకులు ప్లీజ్

### హైకోర్టులో రన్య రావు భర్త జతిన్ పిటిషన్

### గత నవంబరులోనే ఘనంగా పెళ్లి





**కర్ణాటక:** అక్రమంగా బంగారం తరలిస్తూ పట్టుబడి జైలుపాలైన నటి, ఓ డీజీపీ దత్త కుమార్తె రన్య రావు కుటుంబంలో కలతలు తీవ్రమయ్యాయి. ఆమె నుంచి విడాకులు కావాలని భర్త జతిన్ హుక్కేరి కోరుతున్నారు. ఈ మేరకు బెంగళూరు హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. పెళ్లయినప్పటి నుంచి రన్య రావుతో సంసారం ఇబ్బందిగానే ఉందని ఆయన దూరంగా ఉంటున్నారు. ఇంతలో బంగారం స్మగ్లింగ్‌లో భార్య అరెస్టు కావడంతో ఇక కాపురం కుదరదని భావిస్తున్నారు. గత ఏడాది అక్టోబరు 6వ తేదీన బెంగళూరులో బాస్టిన్ రెస్టారెంట్‌లో రన్యా, జతిన్‌హుక్కేరి ఇద్దరూ ఓ పెళ్లిళ్ల పేరయ్య ద్వారా కలుసుకున్నారు. అలా పరిచయం పెరిగి పెళ్లి వరకూ వచ్చింది. అక్టోబరు 24వ తేదీన జతిన్, రన్య నిశ్చితార్థం జరిగింది. గత ఏడాది నవంబరు 27 తేదీన తాజ్‌వెస్ట్ ఎండ్‌హోటల్‌లో అంగరంగ వైభవంగా వివాహ వేడుక జరిగింది, ల్యావెల్లీ రోడ్డులోని ఖరీదైన అద్దె ఇంట్లో నివసిస్తున్నారు.

**ఆది నుంచీ గొడవలు**

తరువాత నెలకే రన్య, జతిన్ మధ్య మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటలు లేవని జతిన్ పిటిషన్‌లో ప్రస్తావించారు. బంధుమిత్రులు రాజీకి ప్రయత్నించినా ఫలితం లేదని తెలిసింది. ఆమె తరచూ దుబాయ్‌కు వెళ్లి వచ్చేది, దీనిని భర్త ప్రశ్నించడంతో గొడవలు జరిగేవి. మరోవైపు స్నేహితుడు తరుణ్ రాజుతో కలిసి బంగారం స్మగ్లింగ్ కేసుల్లో చిక్కుకుంది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



## తీరు మారని ఎస్ఆర్‌హెచ్.. ఓటముల్లో హ్యాట్రిక్

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటుమల పరంపర కొనసాగుతోంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 80 పరుగుల తేడాతో ఎస్ఆర్‌హెచ్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ సన్‌రైజర్స్ ప్లేయర్లు తేలిపోయారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. కోత్‌కతా బ్యాటర్లలో వెంకటేశ్ అయ్యర్(29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 60) టాప్ స్కోరర్‌గా నిలవగా.. రఘువంశీ(50), రింకూ సింగ్(32), రహానే(38) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో కమ్మిన్స్, షమీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలా వికెట్ సాధించారు.


### చేతులెత్తేసిన బ్యాటర్లు..

అనంతరం 201 పరుగుల భారీ లక్ష్య చేధనలో ఎస్ఆర్‌హెచ్ 16.4 ఓవర్లలో కేవలం 120 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్(33), మెండిస్(27) పర్వాలేదన్పించగా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. స్టార్ బ్యాటర్లు అభిషేక్ శర్మ(2), హెడ్(4), ఇషాన్ కిషన్(2) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ ఆరోరా, వరుణ్ చక్రవర్తి తలా మూడు వికెట్లు సాధించగా.. రస్సెల్ రెండు, హర్షిత్ రాణా, నరైన్ ఒక్క వికెట్ సాధించారు. ఈ మెగా టోర్నీలో ఎస్ఆర్‌హెచ్‌కు వరుసగా మూడో ఓటమి కావడం గమనార్హం.

## అభిషేక్ నీకు ఏమైంది..? రూ. 14 కోట్లు దండగ!

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ తన తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అభిషేక్ వరుసగా నాలుగో మ్యాచ్‌లో విఫలమయ్యాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అభిషేక్ తీవ్ర నిరాశపరిచాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ 6 బంతులు ఆడి కేవలం 2 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. హర్షిత్ రాణా బౌలింగ్‌లో స్లిప్‌లో అభిషేక్ దొరికిపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన శర్మ.. కేవలం 33 పరుగులు మాత్రమే చేశాడు. తొలి మ్యాచ్‌లో 24 పరుగులు చేసిన అభిషేక్, ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యాడు. దీంతో అతడిపై ఎస్ఆర్‌హెచ్ అభిమానులు మండిపడుతున్నారు. ఏమైంది అభిషేక్ నీకు అని పోస్టులు పెడుతున్నారు. కాగా ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రూ.14 కోట్ల భారీ ధర వెచ్చించి మరి ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో అభిషేక్‌తో పాటు హెడ్(4), ఇషాన్ కిషన్(2) కూడా నిరాశపరిచారు.

తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. కోత్‌కతా బ్యాటర్లలో వెంకటేశ్ అయ్యర్(29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 60) టాప్ స్కోరర్‌గా నిలవగా.. రఘువంశీ(50), రింకూ సింగ్(32), రహానే(38) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో కమ్మిన్స్, షమీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలా వికెట్ సాధించారు.



## డీఎస్పీ సిరాజ్‌కు సెల్యూట్

### ఆర్సీబీ ఓడను ముంచేశాడు: హర్భజన్



ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో విజయం సాధించిన సంగతి తెలిసిందే. బుధవారం(ఏప్రిల్ 2) చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును గుజరాత్ చిత్తు చేసింది. ఈ విజయంలో గుజరాత్ స్పీడ్ స్టార్ మహ్మద్ సిరాజ్‌ది కీలక పాత్ర. తన మాజీ జట్టుపై సిరాజ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఫిల్ సాల్ట్ (13 బంతుల్లో 14), దేవ్‌దత్ పడిక్కల్ (3 బంతుల్లో 4), లియామ్ లివింగ్‌స్టోన్ (40 బంతుల్లో 54)లను సిరాజ్ ఔట్ చేశాడు. సిరాజ్ తన నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 19 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ క్రమంలో సిరాజ్‌పై భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశంసల వర్షం కుర్పించాడు. తన మాజీ జట్టుపై సిరాజ్ ప్రతీకారం తీర్చుకున్నాడని హర్భజన్ అన్నాడు. "ఐపీఎల్ 2025లో మహ్మద్ సిరాజ్ మంచి రిథమ్‌లో ఉన్నాడు. ఆర్సీబీపై తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరముంది. ఎందుకంటే చాలా సీజన్ల పాటు ఆర్సీబీకి ఆడినప్పటికి అతడిని వారు రిటైన్ చేసుకోలేదు. ఇప్పుడు అదే సిరాజ్ ఆర్సీబీ ఓడను ముంచేశాడు. డీఎస్పీ సిరాజ్‌కు సెల్యూట్. ఇది ఖచ్చితంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదర్శనే. సిరాజ్‌కు అభినందనలు. రషీద్ ఖాన్ మాత్రం భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. బ్యాటింగ్‌లో కూడా గుజరాత్ బాగా రాణించింది" అని తన యూట్యూబ్ ఛానల్‌లో భజ్జీ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో లివింగ్ స్టోన్(54) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జితేష్ శర్మ(33), టిమ్ డేవిడ్(32) రాణించారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్‌తో పాటు సాయికిషోర్ రెండు, అర్షద్, ప్రసిద్ధ్, ఇషాంత్ తలా వికెట్ సాధించారు. అనంతరం 170 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 17.5 ఓవర్లలో చేధించింది. జోస్ బట్లర్(73) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. సాయిసుదర్శన్(49) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

## గుజరాత్‌కు భారీ షాక్..

### స్వదేశానికి వెళ్లిపోయిన రబాడ



ఐపీఎల్ 2025లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, దక్షిణాఫ్రికా స్పీడ్ స్టార్ కగిసో రబాడ తన స్వదేశానికి తిరిగి వెళ్లిపోయాడు. "వ్యక్తిగత కారణాల" కారణంగా రబాడ సౌతాఫ్రికాకు వెళ్లినట్లు గుజరాత్ టైటాన్స్ మెనెజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే అతడు ఎప్పుడు తిరిగి భారత్‌కు వస్తాడన్న విషయాన్ని గుజరాత్ వెల్లడించలేదు. కాగా బుధవారం(ఏప్రిల్ 2)న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌కు కూడా రబాడ దూరమయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో రబాడ లేనప్పటికి గుజరాత్ టైటాన్స్ మాత్రం ఘన విజయాన్ని అందుకుంది. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ వంటి గుజరాత్ స్పీడ్ స్టార్లు అద్భుతంగా రాణించారు. గుజరాత్ టైటాన్స్ తమ తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 6న ఉప్పల్ స్టేడియం వేదికగా ఎస్ఆర్‌హెచ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు కూడా రబాడ దూరమయ్యే అవకాశముంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన రబాడ.. తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. భారీగా పరుగులు సమర్పించుకుని కేవలం రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. అయితే రబాడ తనదైన ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించగలడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# యూడీఐడీ క్యాంపు ల పై అవగాహన సదస్సు

- పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలి
- ఇసుక ట్రాక్టర్ లకు జీపీఎస్ ఖచ్చితంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మహా:** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సెర్ప్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, సీసీలు, మీ సేవా ఆపరేటర్ లు, దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులతో యునిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డు యూడీఐడీ సదరం (21డీ) క్యాంపులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..యునిక్ డిసెబిలిటీ ఐడీ (యూడీఐడీ) కార్డుల జారీలో www.swavalambancard.gov.in వెబ్సైట్ ద్వారా కొత్త దరఖాస్తులను ఆహ్వానిస్తోందని, అలాగే ఇదే పోర్టల్ లో పీడబ్ల్యూడీ లాగిన్ మాడ్యూల్ లో దివ్యాంగులకు సంబంధించిన వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ పోర్టల్ లో దివ్యాంగుల పూర్తి వివరాలను ఎటువంటి తప్పులు లేకుండా స్పష్టంగా, అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, పీడబ్ల్యూడీ యాక్ట్ 2016 ప్రకారం అనర్హులకు ఈ డిసెబిలిటీ కార్డులను ఇస్తే, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అంతకుముందు వారందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించారు. అనంతరం ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, సీసీలతో ఇందిరమ్మ ఇళ్లు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, పింఛన్లు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తదితరాలపై సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 12 మండలాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్, గ్రౌండింగ్ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజాపాలన గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా సర్వేను, యాప్ లో వివరాల నమోదు వంటి వాటిని సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక తరలింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఆయా రూట్ లలో సజావుగా నిర్వహించాలని, అలాగే ఇసుక ట్రాక్టర్ లకు జీపీఎస్ ఖచ్చితంగా ఉండాలని, ఏ గ్రామానికి ఇసుకను తరలిస్తున్నారో ఆ రాకపోకలకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఐకేపీల ద్వారా 157 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. వాటిలో అందుకు కావలసిన ప్యాడి క్లీనర్లు, గన్ని సంచులు, కాంటాలు, తదితర మౌలిక వసతులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పెండింగ్ లో గల వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, శాశ్వత వలస పింఛన్లు, స్వయం సహాయక సంఘాల మహిళలకు బీమా దరఖాస్తులను ఈ నెల 10 లోగా పూర్తిచేయాలన్నారు. ఏకరూప దుస్తుల కుట్టు ప్రక్రియలో విద్యార్థుల కొలతలను త్వరగా తీసుకోవాలని, కొలతలు అయిపోయిన వాటివి దర్జీలు నాణ్యతతో కుట్టు పని మొదలుపెట్టాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ కింద నిర్దేశించిన లక్ష్యాలను మేరకు పనులు పూర్తిచేయాలని, ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, వేసవి కార్యాచరణ ప్రణాళికను సరైన విధంగా అమలు చేయాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, నర్సరీలను సక్రమంగా నిర్వహిస్తూ, మొక్కలను సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్డీఏ వసంత, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే

**హన్మకొండ, మహా:** వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీస్ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్ వరంగల్ ట్రాఫిక్ సూచనల ప్రకారం కాజిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వ్యక్తులు పట్టుపడగా అందులో ఐదుగురు వ్యక్తులు మోతాదు కు మించి మద్యం సేవించిగా వారిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుచుగా ఐదుగురికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఫాతిమా చిన్నప్ప జైలు శిక్ష విధించారు. వివరాల్లోకెళ్తే.. 1) చిన్న, రేణుబాబు, 2) రాచుటి, బాలచంద్రుడు, 3)భూక్యా, కొమురెల్లి, 4)సల్ల, రాజేష్ లకు 2 రోజుల జైలు శిక్ష తోపాటు 5)వేమూగంటి,రవీందర్ కు ఒక రోజు జైలు శిక్ష విధించగా వారిని పరకాల సబ్ జైలుకు పంపటం జరిగిందని కోర్టు వారితో పాటు మరో 16 మందికి 20,600 /రూపాయల జరిమాన కూడా విధించడం జరిగిందని కాజిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి నాగబాబు తెలిపారు.

## జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు కలెక్టర్ విజ్ఞప్తి**



**వరంగల్, మహా:** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో ఈనెల 11న వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు టాస్క్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. జాబ్ మేళాకు సంబంధించిన సన్నాహక సమావేశం గురువారం వరంగల్ లోని ఎంకే నాయుడు ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి పలు కంపెనీల ప్రతినిధులు, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, డిఆర్డిఓ జిఎం, జడ్పీ సీఈవో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రామేశ్వర్, మెప్మా ప్రతినిధులు సుమారు 200 మంది వరకు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా యువతీ యువకులందరూ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని, తమ పేరును నమోదు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు. నిర్వాహకులు విడుదల చేసిన పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు ఎన్ రోల్ చేసుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీన ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభం అవుతుందని కలెక్టర్ గుర్తు చేశారు.

# ఫస్ట్రేషన్ లో బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర
- హెచ్ సీ యు భూములపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయం చేస్తున్నాయి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**జనగామ మహా :** రాష్ట్రానికి అప్పులు పుట్టే పరిస్థితి లేదని కేంద్ర మంత్రులు పరిపాలన పై కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయంలోఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 90లక్షల రేషన్ కార్డులు ఉండగా 2కోట్ల 81లక్షల 50వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పుడు కొత్తగా వచ్చిన దరఖాస్తుల ద్వారా మరో 10లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు కానున్నాయని మొతంగా 1కోటి రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి లబ్ది చేకూరానుందని తెలిపారు. ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున మొత్తం బియ్యం పంపిణీకి 13వేల 500కోట్లు ఖర్చు అవుతుందని అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 8వేల కోట్లు అయితే కేంద్ర ప్రభుత్వ వాటా 5వేల 500కోట్లు అని తెలిపారు. కానీ బండి సంజయ్ అనే కేంద్ర మంత్రి కిలో 40రూపాయలు అయితే 30రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తే 10రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కనీస అవగాహన లేకుండా బండి సంజయ్ మాట్లాడటం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా బీజేపీ ప్రభుత్వానికి పేద ప్రజల పట్ల ప్రేమ ఉంటే దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసి వారి చిత్త శుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మంచి పని చేస్తే చేయూత ఇవ్వాలని అంతేకాని విమర్శలు చేయకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేసిన బిఆర్ఎస్ నాయకులు



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం విద్యా వ్యవస్థపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మొండి వైఖరి నశించాలని డిమాండ్ చేస్తూ, మోత్కూర్ మండల బీఆర్ఎస్ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గాడి తప్పిందని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి తన అనుచరులకు కట్టబెడుతున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ధ్వజమెత్తారు. దీనిపై స్పందించిన సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి దాడులు చేయడం అమానుషమని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, అట్టి భూమిని యూనివర్సిటీకి అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడ తామని హెచ్చరించారు.

## పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలు

- భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాడిన యోధుడు
- భూస్వామ్య పాలనకు వ్యతిరేక పోరాటం
- తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు
- జిల్లా రెవెన్యూ అధికారి సంగీత




**రంగారెడ్డి జిల్లా, మహా:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య చూపిన స్పూర్తిని కొనసాగించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీ దొడ్డి కొమురయ్య 98వ జయంతి ఉత్సవంలో, రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొనీ, జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా డిఆర్ఓ మాట్లాడుతూ... దొడ్డి కొమరయ్యస్పూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని, తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో 1927 ఏప్రిల్ 3న జన్మించారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమవడానికి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి బి.కేశురాం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు పి.రమేష్, వై.మాధవ రెడ్డి, కుల సంఘం నేతలు బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, సిహెచ్ కొండయ్య, చిత్తరంజన్, కాటపల్లి శ్రీశైలం, పొన్నాల సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు

**వరంగల్, మహా:** 2024 సంవత్సరంలో ఓ మైనర్ బాలిక పై అత్యాచారానికి పాల్పడి బాలిక గర్భం దాల్చిన సంఘటనలో నిందితుడు గీసుకొండ మండలం, మనుగొండ గ్రామని చెందిన చాపర్తి సాంబయ్య (65) యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ వరంగల్ ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి. ప్రేమలతా రెడ్డి సంచలన తీర్పును వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలకంగా నిలిచిన కేసు దర్యాప్తు అధికారి మామూనూర్ ఏసీపి తిరుపతి, అప్పటి స్టేషన్ ఇన్స్పెక్టర్ బాబూలాల్, పి పి రవికిరణ్, భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ నీరజతో పాటు గీసుగొండ కోర్టు కానిస్టేబుల్ ను వరంగల్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

## సంస్కార భారతి ఆధ్వర్యంలో కవులకు సన్మానం




**వరంగల్, మహా:** సంస్కార భారతి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కే.ఎల్.ఎన్ రెడ్డి కాలనీలోని స్పెక్ట్రా హై స్కూల్లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులకు, కవులకు గురువారం పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంజీఎం రిటైర్డ్ ఆర్ఎంఓ, సంస్కార భారతి అధ్యక్షులు డాక్టర్ బందెల మోహన్ రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జే.పీ నిరంజన్, రాష్ట్ర సంఘటనా మంత్రి రాష్ట్ర కార్యదర్శి గడ్డం వెంట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పండితులు వేదాంతం వరదరాజాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి వరంగల్ మహానగర కమిటీ ప్రకటించటం జరిగింది వరంగల్ జిల్లా అధ్యక్షుని గా కంజర్ల హరినాధరావు, ప్రధాన కార్యదర్శిగా డా. ప్రశాంత్, తదితరులు కలిసి నూతన కమిటీనీ ఎన్నుకున్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- హెచ్ సి యు భూముల జోలికి వస్తే ఉద్యమిస్తాం
- బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్, మహా:** చేతగాని కబ్జాకోరు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం లాఠీ ఛార్జ్ చేయడానికి నిన్న జరిగిన ఛలో హెచ్ సి యు కార్యక్రమంలో బీజేవైఎం నాయకుల పట్ల పోలీస్ లు ప్రవర్తన విధానాన్ని భారతీయ జనతా యువమోర్చా వరంగల్ శాఖ తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా దిష్టి బొమ్మ దహనం చేశారు. విశ్వవిద్యాలయం భూములను కాపాడుకోవాలి అదేవిధంగా పర్యావరణాన్ని మూగజీవాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్న అమాయక విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయడం పట్ల బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి తక్షణమే బహిర్గత క్షమాపణ చెప్పాలని బీజేవైఎం వరంగల్ డిమాండ్.చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ చేతగాని రేవంత్ రెడ్డి పరిపాలన చేయరాకపోతే వెంటనే రాజీనామా చేయాలని అంతేగాని హైదరాబాద్ మహానగరానికి ఆక్సిజన్ లాంటి సెంట్రల్ యూనివర్సిటీ బయోడైవర్సిటీ పార్క్ ని తనకు అనుకూలించే ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అమ్మడం సరికాదని అదేవిధంగా విద్యార్థుల భావి భవిష్యత్తు కోసం ఉంచబడిన సెంట్రల్ యూనివర్సిటీని అన్యాక్రాంతం చేయడానికి చూస్తే భారతీయ జనతా పార్టీ సహించబోదని దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏర్రగోల్ల భరత వీర్ యాదవ్ మాట్లాడుతూ. కెసిఆర్ ప్రభుత్వం యూనివర్సిటీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే దాన్ని వారసత్వంగా రేవంత్ రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ భూములను సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని దీనిని వెంటనే ఆపకపోతే ఉద్యమం తీవ్రతరం చేసి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తూ ఎక్కడికక్కడ రాష్ట్ర ప్రభుత్వ మరియు నాయకులను దిగ్బంధం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రావణ్, బిజెపి వైస్ ప్రెసిడెంట్ ఎరుకుల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, ప్రణయ్, రాళ్ల బండ మున్నా, వినయ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## వాహన మరమ్మత్తుల్లో జాప్యం పై మేయర్ ఆగ్రహం

- వెహికల్ షెడ్ ను ఆకస్మికం గా తనిఖీ చేసిన మేయర్
- వాహన మరమ్మత్తు నిర్వహణ రిజిస్టర్ పరిశీలన...



**హన్మకొండ, మహా:** గ్రేటర్ వరంగల్ మహా నగరంలో చెత్తను తరలింపు చేసే వాహనాల మరమ్మత్తులు చేయడంలో జాప్యం వహించడం పై నగర మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. హన్మకొండ లోని బాల సముద్రం లో గల వెహికల్ షెడ్ ను మేయర్ గురువారం ఆకస్మికం గా తనిఖీ చేసి వాహన మరమ్మత్తు లకు చెందిన రిజిస్టర్ ను పరిశీలించి నిర్వహణ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా మేయర్ చెత్త తరలింపు కు సంబంధించి ఎన్ని స్వచ్చ ఆటో లు పెద్ద వాహనాలు మరమ్మత్తు లకు గురయ్యాయి? ఎన్ని రిపేరింగ్ లు చేయించారు వంటి విషయాలను ఇంజనీరింగ్ అధికారులను అడుగగా 19 స్వచ్చ ఆటో లు 8 పెద్ద వాహనాలు మరమ్మత్తులకు పంపించినట్లు తెలిపారు. 2 నెల ల కాలం పాటు వాహనాల కు మరమత్తులు చేయకుండా జాప్యం చేయడం వల్ల శానిటేషన్ కుంటుపడుతుందని సుదీర్ఘ కాలం వాహనాలకు మరమత్తులు చెయ్యకుండ పెండింగ్ లో ఉంచడం సరికాదని అన్నారు.ఈ సందర్భం గా షెడ్ లో వాహనాలకు మరమత్తులు నిర్వహించే సిబ్బంది మేయర్ కు సమస్యలను వివరిస్తూ వాహనాలకు పంక్చర్లు చేసే క్రమం లో టైర్లు విప్పినపుడు చేతులకు రక్షణ కవచాలు లేనందున గాయాలు అవుతున్నాయని మేయర్ దృష్టికి తీసుకురాగా సిబ్బంది కి వెంటనే గ్లోజు లు అందజేసి ప్రమాదాలు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ చంద్ర, ఈ ఈ మహేందర్, డి ఈ శివానంద్, ఏ ఈ లు ఫణికుమార్, సంతోష్ కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

## మహిళ గిరిజన కార్పొరేటర్ పై అనుచిత వాఖ్యలు

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని అరెస్టు చేయాలి**



**ఎల్బీనగర్,మహా:** హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సహించరానివని.. సుధీర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయాలని ఆమెకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ డిమాండ్ చేశారు. వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించాల్సిన సంస్కారం, సభ్యత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి లేదన్నారు. గిరిజన మహిళా కార్పొరేటర్ వ్యక్తిత్వాన్ని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పటి వరకు క్షమాపణ చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యేపై పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేస్తామని, పోలీసులు ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఇవ్వని నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 15 నెలల్లో ఇచ్చామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తట్టుకోలేక, దొంగ చాటున గల్లీ లీడర్లు, రౌడీ షీటర్లను వెంట వేసుకొని వెళ్లి కొబ్బరికాయలు కొడుతూ శంకుస్థాపనలతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 7న ఎల్బీనగర్ నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఎల్బీనగర్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు హాజరవుతున్నారని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కూడా వచ్చి కొబ్బరికాయ కొట్టవచ్చన్నారు. కొబ్బరికాయ కొట్టి ఆ నీళ్లు నెత్తిన చల్లుకొని సుజాత నాయక్ ని క్షమాపణ కోరాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి, బానోతు సుజాత నాయక్, డివిజన్ అధ్యక్షులు కుంట్ల నర్సింహా యాదవ్, శశిధర్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్ధ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది



**రంగారెడ్డి జిల్లా, మహా:** రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు వరదలా పారింది. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

**రైతులకు భారీ నష్టం వాటిల్లింది...**

వర్షంతో రైతాంగానికి తీరని నష్టం వాటిలిందని రైతులు వాపోయారు. ఈ అకాల వర్షాల కారణంగా జిల్లాలోని మామిడి తోటలలో మామిడి పిందెలు, మోస్తారు కాయలు నేలరాలయాన్ని, కష్టపడి సాగు చేసిన పంట నేల రాల్లడంతో భారీగా నష్టం చవిచూడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి సాగు చేసే రైతులు ఈ వర్షంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు రకాల పంటలు ఆగమయ్యాయని, నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని, పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు.


## ప్రహరీగోడ కూలి ఇద్దరికి తీవ్ర గాయాలు



**ఎల్బీనగర్, మహా:** ఇంటి నిర్మాణం కోసం పనులు చేస్తుండగా ప్రహరీ గోడ కూలి ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికీ తీవ్ర గాయలైన ఘటన హైదరాబాద్ చైతన్యపురి లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే కర్మన్ ఘాట్ లో నివసించే నేనావత్ అనిల్, సరోజ, భానుప్రసాద్, రమావత్ అనిల్, రెండేళ్ల చిన్నారి నందిని వీరంతా ఒకే కుటుంబ సభ్యులు. గురువారం సాయంత్రం తుర్కయంజాల్ లో జరిగే తమ బంధువుల ఫంక్షన్ కు తమ ఆటోలో బయలుదేరారు. కర్మన్ ఘాట్ లో జేసిబితో నిర్మాణం కోసం పనులు జరుగుతుండగా ఆ పక్క నుండి ఆటో వెళ్తుండగా ఒక్కసారిగా ప్రహరీ గోడ కూలీ ఆటోపై పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో సరోజ, అనిల్ కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా భవనం నిర్మాణం యజమానులు ఎవరు కూడా సహాయం అందించకపోగా పరామర్శించలేదని వారిపై చట్టపర్యమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్ చేసారు.

## దొడ్డి కొమురయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

- ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు.. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మహా:** దొడ్డి కొమురయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లాలోని హైదరాబాద్ రోడ్ లో గల కళ్లెం కమాన్ వద్ద వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరయ్యి, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. భూమి, భుక్తి కొరకు, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఆధునిక సామాజిక పోరాటాలకు మార్గదర్శి అయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా వీరా స్వామి, కురుమ కుల సంఘం నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షం ధాటికి మూసి లో చిక్కుకున్న ఇద్దరు



**ఎల్బీనగర్,మహా:** చైతన్యపురి డివిజన్ లోని లక్ష్మి నర్సింహా టెంపుల్ దగ్గర ప్రవహిస్తున్న మూసీ నదిలో ఇద్దరు వరదలో చిక్కుకున్నారు. గురువారం సాయంత్రం భారీ వర్షం కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద మూసీలో చేరుతుంది. మూసీ లో ఇద్దరు చిక్కుకున్నట్లు సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.ప్రమాదకరంగా మూసి ప్రవహిస్తుండడంతో చిక్కుకున్న వారు బయటకు వచ్చే పరిస్థితి లేదు దీంతో గజ ఈతగాళ్ల సాయంతో డీఆర్ఎఫ్ సిబ్బంది,పోలీసులు చిక్కుకున్న ఇద్దరిని సురక్షితంగా బయటకు తీసుకుని వచ్చారు. పరిస్థితిని కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత తదితరులు సమీక్షించారు.